ప్రజాశక్తి
సోమవారం 24 మార్చి 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

నిరుపేదల గుర్తింపునకు సర్వే



పి-4 సర్వేను పరిశీలిస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి(ఫైల్)

- కనీస వసతులు, సౌకర్యాల నమోదు
- ఎలక్ట్రానిక్ వస్తువులు, ద్విచక్ర వాహనం ఉన్నా 'చేయూత' దూరం
- గ్రామాల్లో 200 యూనిట్ల విద్యుత్ వినియోగం దాటితే పేదరికం లేనట్లే

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పి-4 సర్వే గుంటూరు, పల్నాడు జిల్లాల్లో శనివారం ముగిసింది. ఈనెల 8 నుంచి ఈసర్వే ప్రారంభమైంది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ఈ సర్వే నిర్వహించారు. పేదరికంలో ఉన్న జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాలకు ప్రభుత్వం ఆన్‌లైన్‌లో పంపింది. ఈ జాబితా ఆధారంగా ఆయా ప్రాంతాల్లో ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పేదరికంలో ఉన్నారా లేదా అన్న విషయాన్ని నమోదు ప్రక్రియను చేపట్టారు. ప్రభుత్వం నమోదు చేస్తున్న సర్వే వల్ల తమకు అందుతున్న వివిధ సంక్షేమ పథకాలు రద్దు అవుతాయేమోనన్నభయం పేద ప్రజలను వెంటాడింది. జనాభాలో ఉన్న 20 శాతం మంది పేద, నిరుపేదలను గుర్తించి వారిని జనాభాలో 10 శాతం వరకు ధనికులు దత్తత తీసుకుని వారి అభ్యున్నతికి పలు కార్యక్రమాలు రూపొందించేందుకు ప్రభుత్వం ఈ సర్వే చేపట్టిందని అధికారులు తెలిపారు.

ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం ఎటువంటి వసతీ, సరైన జీవనం లేనివారిని గుర్తించేందుకు ఈ సర్వే చేపట్టినట్లు అధికారులు తెలిపారు. 200 యూనిట్ల వినియోగం దాటినా, ట్యాప్ కనెక్షను ఉన్నా, ఎలక్ట్రానిక్ వస్తువులు, సొంత ఇల్లు ఉన్నా వారిని పేదలుగా గుర్తించరు. ఈ సర్వేలో పేదలను గుర్గించేందుకు వీలుగా పట్టణ ప్రాంతాల్లో నెలవారీ విద్యుత్ వినియోగం, ప్రభుత్వ, ప్రైవేటు ▶ 2లో



సమావేశంలో మాట్లాడుతున్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఏల్చూరి వెంకటేశ్వర్లు

ప్రజావసరాలు తీర్చేలా బ్రిడ్జిని నిర్మించాలి

- ముందుగానే ఆర్‌యుబి నిర్మించాలి
- 26న శంకర్ విలాస్ వద్ద అవగాహన కార్యక్రమం
- శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణంపై పౌర సంస్థలు

ప్రజాశక్తి-గుంటూరు

రాజధాని ప్రాంతంలోని గుంటూరులో పున:నిర్మించబోయే శంకర్ విలాస్ బ్రిడ్జి భవిష్యత్ ప్రజల అవసరాలు తీర్చే విధంగా ఉండాలని, బ్రిడ్జి కంటే ముందే ఆర్‌యుబి నిర్మించాలని పౌర సంస్థలు స్పష్టం చేశాయి. నిర్మాణ సమయంలో గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు అనుసంధానం కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అభివృద్ధి చేయాలని కోరాయి. శంకర్ విలాస్ బ్రిడ్జి పున:నిర్మాణం నేపథ్యంలో ప్రస్తుత డిజైన్‌లో పలు మార్పులు చేయాలని కోరుతూ పౌర సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం బ్రాడీపేటలోని బాలానంద కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఫెడరేషన్ అఫ్ అపార్ట్‌మెంట్స్ అండ్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ ఎల్.ఎస్.భారవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఏల్చూరి వెంకటేశ్వర్లు, బిల్డర్స్ అసోసియేషన్ నాయకులు గద్దె తిరుపతిరావు, సీతారామయ్య, రేట్ పేయర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ఫోరం ఫర్ డెమోక్రటిక్ అసోసియేషన్ నాయకులు అవధానుల హరి, ప్రోగ్రెసివ్ ఫోరం నాయకులు మల్లికార్జునరావు, ఎస్‌హెచ్ఒ అధ్యక్షులు డాక్టర్ టి.సేవాకుమార్, పౌర సంఘాల ▶ 2లో



సదస్సులో మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు

మురుగు నుండి తాడేపల్లిని బయటపడేయాలి

- దుర్గంధం, దోమలతో సహవాసం చేస్తున్న జనం
- 17 అంశాల పరిష్కారం కోసం సదస్సులో నాయకులు, ప్రజలు

ప్రజాశక్తి- తాడేపల్లి

మురుగు సమస్య నుండి తాడేపల్లిని ప్రభుత్వం బయటపడేయాలని రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు డిమాండ్ చేశారు. తాడేపల్లి బైపాస్ రోడ్, గ్రామాల్లో డ్రెయినేజీ, నీటి సమస్య, తదితర 17 అంశాలపై ఆశ్రమం రోడ్‌లోని అమరావతి ఐకాన్ సమీపంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. సదస్సుకు కుంచనపల్లి అవంతి అపార్ట్మెంట్ నివాసి జొన్నవిత్తుల శేషయ్య అధ్యక్షత వహించారు. మధు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నగరాల కంటే నాలుగు రెట్లు పన్నులు అదనంగా వసూలు చేస్తున్న తాడేపల్లిలో సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదన్నారు. ఇక్కడ నివాసం ఉంటున్నా అపార్ట్మెంట్లో నుండి మురుగు బయటకు పోవడానికి దారి లేక, ప్రజలు దోమలతో సహవాసం చేయాల్సి వస్తోందన్నారు. ఎన్నికల ముందు ప్రస్తుత మంత్రి లోకేష్ ఇచ్చిన హామీలు నేటికీ అమలు కాలేదన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక పంట కాల్వలు సైతం మురుగు నీరు, వ్యర్థాలతో నిండిపోయాయని, పొలాల్లో పంటలేయడానికీ వీల్లేకుండా పోయిందని ఆందోళన వెలిబుచ్చారు. డ్రెయినేజీ వ్యవస్థ పరిష్కారం కాకపోతే గ్రామాల మధ్య స్పర్ధలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. భూగర్భ జలాలు కలుషితమైందని, వేలాది మంది నివాసం ఉంటున్న ఈ ప్రాంతంలో రైతు బజార్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనేక ▶ 2లో

29న కౌన్సిల్ సాధారణ భేటి

మేయర్ రాజీనామాకు రేపు ఆమోదం? - 2 లో

డ్రెయినేజీ సమస్యలపై తాడేపల్లి పట్టణ వాసుల్లో తీవ్ర ఆవేదన

పర్యటించిన మధు ఎదుట సమస్యలు వెళ్లబోసుకున్న అపార్ట్‌మెంట్ల నివాసులు

ప్రజాశక్తి -తాడేపల్లి

తాడేపల్లి బైపాస్ రోడ్ శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. రాజధాని ముఖద్వారం గా ఉన్న ఇక్కడ పెద్ద ఎత్తున గేటెడ్ కమ్యూనిటీ నిర్మాణాలతో పాటు, అపార్ట్మెంట్లు నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అయితే డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మురుగునీరు పారుదల లేకుండానే కార్పొరేషన్ అధికారులు నిర్మాణాలకు అనుమతులు ఇబ్బడి ముంబడిగా ఇచ్చేస్తున్నారు. ఫలితంగా ప్లాట్లు కొనుగోలు చేసిన లబ్ధిదారుల పాట్లు అన్ని ఇన్ని కావు. ఈ నేపథ్యంలో అపార్టుమెంట్ నివాసితులతో కలిసి సిఎస్ఆర్ కళ్యాణ మండపం నుండి ఆశ్రమం వరకు రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు ఆదివారం పర్యటించగా అనేకమంది తమ ఆవేదనను ఆయన ఎదుట వెళ్లబోసుకున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన కాంట్రాక్టర్లు పనులు మధ్యలోనే వదిలి వెళ్లటం వల్ల మురుగు కాల్వలు చెరువుల మారిపోయాయని, డ్రెయినేజీ మధ్యలో నిలిచిన కరెంటు స్తంభాలను అలాగే వదిలేయడం వల్ల అవి ఎప్పుడు కూలి మీద పడతాయోననే భయంగా ఉందని చెప్పారు. ▶ 2లో



రంజాన్ సమయాలు

ఇఫ్తార్ : 6.24 (సోమవారం - సాయంత్రం)

సహర్ : 4.52 (మంగళవారం - ఉదయం)



సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో అదనపు గదులను ప్రారంభిస్తున్న మంత్రి

పిడుగురాళ్ల మెడికల్ కాలేజీ వచ్చే ఏడాదికి పూర్తి

ప్రతి నియోజకవర్గంలోనూ 100 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

మంత్రి సత్యకుమార్ - సత్తెనపల్లి ఆస్పత్రిలో అదనపు గదులు ప్రారంభం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో మల్టీస్పెషాల్టీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ చెప్పారు. వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసిన సత్తెనపల్లిలోని ప్రాంతీయ వైద్యశాలలో రూ.ఏడు కోట్ల నాబార్డ్ నిధులతో నిర్మించిన అదనపు గదులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతోకలిసి మంత్రి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిడుగురాళ్ల మెడికల్ కాలేజీని వచ్చే ఆర్థిక సంవత్సరంలోగా పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. రాష్ట్రంలో 300 సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లను నియమిస్తున్నట్లు చెప్పారు. సత్తెనపల్లి ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న మూడు వైద్య నిపుణుల పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో 24 క్రిటికల్ కేర్ బ్లాగులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లోనూ 100 పడకల ఆస్పత్రులను ▶ 2లో

నిరుపేదల గుర్తింపునకు సర్వే

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగంతోపాటు ఆదాయ పన్ను, జిఎస్‌టి రిటర్నులు, సొంత ఆస్తి, ఇల్లు, నాలుగు చక్రాల వాహనం, ఆదాయ మార్గాలు అద్దె, వడ్డీ, పింఛన్లు పొందుతున్న వివరాలను నమోదు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సాగుభూమి, విద్యుత్ వినియోగం, సొంత విద్యుత్ కనెక్షన్లు, తాగునీటి ట్యాప్, బ్యాంకు ఖాతా, టివి, ఫ్రిజ్, ఎసి ల్యాప్ ట్యాప్, పక్కా గృహం తదితర వివరాలను ప్రజలనుంచి అడిగి నమోదు చేశారు. ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం సంబంధిత వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారు, కుటుంబాల్లో మృతి చెందిన వారి వివరాలను నమోదు చేయరు. ఇంటిలో ఎంత మంది సంపాదిస్తారు? వారి ఆదాయం, ఏదైనా పింఛన్లు పొందుతున్నారా? వీటి వివరాలు, బ్యాంకు ఖాతా నెంబరు, సొంత ఆస్తి వివరాలు, టూ వీలర్ వివరాలు, విద్యుత్ కనెక్షన్లు వివరాలు, ట్యాప్ కనెక్షను, రోజుకు తాగునీరు ఎంత సేపు వస్తుంది, ఎన్ని రోజులకు వస్తుంది? ఫ్రిజ్, వాషింగ్ మిషన్, ఎసి ల్యాప్ టాప్,కంప్యూటర్, టివి వివరాలతో పాటు మొత్తం 27 ప్రశ్నలకు జవాబులు నింపాలని సర్వే చేసే ఉద్యోగులకు ప్రభుత్వం సూచించగా ఈమేరకు వివరాలను నమోదు చేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఆయా కుటుంబంలో ఒకరి నుంచి బయోమెట్రిక్ లేదా ఫోన్ ఒటిపి ద్వారా సర్వే చేపడతారు. పేరు, ఆధార్ నంబరు, ఫోన్ నంబరు ఆధారంగా మిగతా వివరాలు నమోదు చేసినట్టు తెలిపారు. సర్వేకు సంబంధించిన వివరాలను మంగళవారం లోగా ప్రభుత్వానికి పంపాలని ఉన్నతాధికారులు నిర్దేశించారు. జిల్లాల నుంచి వచ్చిన సమాచారాన్ని క్రోడికరించి ఈనెల 30న సిఎం చంద్రబాబు రాష్ట్ర స్థాయిలో పి-4 విధానాన్ని వెలగపూడిలో ప్రజల సమక్షంలో విడుదల చేస్తారని అధికారులు తెలిపారు.

పైలట్ ప్రాజెక్టుగా మంగళగిరి ఎంపిక

అన్ని నియోజకవర్గాల్లో పి4 విధానం అమలుల్లో భాగంగా రూపొందించనున్న విజన్ 2047 డాక్యుమెంట్లను జిల్లాలో తొలి విడత మంగళగిరి నియోజకవర్గంలో అధికారులు సిద్ధం చేసి గత నెలలోనే మంత్రి నారా లోకేష్‌కు అందచేశారు. ఈ డాక్యుమెంట్స్‌ను పరిశీలించిన మంత్రి లోకేష్ వీటిని ఆమోదించి మిగతా అన్ని నియోజకవర్గాల్లో ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ఇందులో భాగంగా సర్వే తరువాత ప్రతి నియోజకవర్గానికి విజన్ డాక్యుమెంట్స్ ను స్థానిక అంశాల ఆధారంగా రూపొందించేందుకు కసరత్తు జరుగుతోంది. పతి రంగంలోనూ 15 శాతం వద్ధిరేటు సాధించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. అయితే తొలుత ఐదేళ్లకి సంబంధించిన విజన్ డాక్యుమెంట్స్ రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించగా ఆ తర్వాత ఈ నిర్ణయంలో మార్పు జరిగింది. 2047 నాటికి అన్ని రంగాల్లో సాధించనున్న వృద్ధికి సంబంధించి కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గ్రామాలు, పట్టణాల్లో మౌలిక సదుపాయాలు, విద్యా వైద్య సౌకర్యాలు కల్పించడంపై శాఖల వారీగా నివేదికలను సిద్ధం చేశారు.

పిడుగురాళ్ల మెడికల్ కాలేజీ వచ్చే ఏడాదికి పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి కోటి 20 లక్షల మందికి ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించామని తెలిపారు. రాజుపాలెంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని, నరసరావుపేటలో రూ.36 కోట్లతో 75 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ మంజూరు చేశామని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి సత్యకుమార్ సహకారంతో ఆసుపత్రికి మౌలిక వసతులు సమకూరుస్తామని చెప్పారు. అనంతరం సిఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ గోదాముల్లో రైతులు నిల్వ చేసుకున్న పంటలకు సంబంధించి చెక్కులను అందచేశారు. నరసరావుపేట రోడ్డులోని నందు సాయికృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో నూతన ఐసియు సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, పల్నాడు జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి, జిల్లా కోఆర్డినేటర్ రంగారావు, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్షణరావు పాల్గొన్నారు.

29న కౌన్సిల్ సాధారణ భేటి

మేయర్ రాజీనామాకు రేపు ఆమోదం?

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : గుంటూరు నగర పాలకసంస్థ సాధారణ సమావేశం ఈనెల 29న జరగనుంది. ఈమేరకు అధికారులు కార్పొరేటర్లకు సమాచారం ఇచ్చారు. అదే రోజు బడ్జెట్ కూడా ఆమోదిస్తారు. ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీల్లో ఆమోదించిన బడ్జెట్‌ను సాధారణ సమావేశంలో ఆమోదించాల్సి ఉంది. జనవరి 4న వాయిదా పడిన సాధారణ సమావేశం దాదాపు మూడు నెలల తరువాత శనివారం జరగనుంది. జనవరి 4న జరిగిన సమావేశంలో వైసిపి సభ్యులకు, కమిషనర్‌కు మధ్య ఏర్పడిన వివాదం తీవ్ర రూపం దాల్చింది. కమిషనర్‌తో సహ అధికారులంతా సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సాధారణ సమావేశం జరగలేదు. తొలుత స్టాండింగ్ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్, తరువాత ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సమావేశం జరగలేదు. అలాగే ఈనెల 15న మేయర్ కావటి మనోహర్ నాయుడు రాజీనామా సమావేశం నిర్వహణకు మరింత జాప్యం జరిగింది. అలాగే మేయర్ కావటి మనోహర్ నాయుడు రాజీనామాను ఆమోదించేందుకు ఈనెల 20న జరగాల్సిన సమావేశాన్ని 25వ తేదీ మంగళవారం కు వాయిదా వేశారు. మంగళవారం జరిగే సమావేశం ఇన్‌ఛార్జి మేయర్ సజీలా అధ్యక్షతన జరగనుంది. ఈ సమావేశంలో మేయర్ కావటి మనోహర్ రాజీనామాను ఆమోదించిన తరువాత వాయిదా వేస్తారు. తరువాత నూతన మేయర్ ఎన్నిక కోసం ఎన్నికల కమిషన్‌కు జిల్లా కలెక్టర్ నివేదిస్తారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నూతన మేయర్ ఎన్నికకు షెడ్యూలు ప్రకటిస్తుంది. ఈ ప్రక్రియ ముగిసే లోగా కార్పొరేషన్ వ్యవహారాలను నిర్వహించేందుకు ఇన్‌ఛార్జి మేయర్‌ను ప్రభుత్వం నియమించింది. ఈమేరకు సజీలా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. 29న .జరగనున్న సాధారణ సమావేశంకు కూడా ఆమె అధ్యక్షత వహిస్తారు.

బెట్టింగులు పెట్టినా, నిర్వహించిన కఠిన చర్యలు

గుంపులుగా చేరి సెల్‌ఫోన్ క్రికెట్ చూస్తూ పందేలు పెట్టినా నేరమే : ఎస్పీ

పజాశక్తి-పల్నాడు జిల్లా

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా ఎస్‌పి కె.శ్రీనివాసరావు అన్నారు. ఐపిఎల్ క్రికెట్ బెట్టింగ్, జూదం చట్ట విరుద్ధమని, ఇది ఆర్థికంగా, సామాజికంగా జీవితాలను నాశనం చేస్తుందని చెప్పారు. కుటుంబాలను రోడ్డున పడేసి చిన్నాభిన్నం చేసే ఆన్లైన్ బెట్టింగ్ యాప్‌లపట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. శ్రమించకుండా వచ్చే నగదు వెనుక అనేక నష్టాలు దాగి ఉండడంతో పాటు కేసుల్లో నిందితులుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. యువత, విద్యార్థులు బెట్టింగ్ జోలికి వెళ్లకుండా చదువుపై దృష్టి సారించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా బెట్టింగ్‌లపై నిఘా ఏర్పాటు చేశామని, పిల్లలపై తల్లిదద్రులు కూడా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. బెట్టింగ్ కార్యకలాపాలు జరిగినట్లయితే కుటుంబ సభ్యులు పిల్లలు, పెద్దలు క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నారని సమాచారం ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో లేదా డయల్ 100/112కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. గతంలో బెట్టింగులకు పాల్పడిన పాత నేరస్తుల వివరాలు సేకరించి కౌన్సిలింగ్ నిర్వహించి వారిపై నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్‌లకు పాల్పడినా, గుంపులు గుంపులుగా కూర్చుని సెల్ చూస్తూ బెట్టింగ్స్ వేస్తున్నా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆవేదన వ్యక్తం చేశారు.

మురుగు నుండి తాడేపల్లిని బయటపడేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాల్లో ఎస్‌టిపిలు పెట్టి మురుగునీటిని శుద్ధి చేసి వాటికి బయటకు పంపే ఏర్పాటు మున్సిపల్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం అయ్యేంత వరకూ అపార్ట్మెంట్ వాసులు దశల వారీగా కార్యాచరణ చేస్తారని చెప్పారు.

పట్టణ పౌర సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ తాడేపల్లి ప్రాంతంలో ఇప్పటికే పెద్దపెద్ద బహుళ అంతస్తుల భవనాలు నిర్మితమయ్యాయని, రాబోయే రోజుల్లో మరిన్ని నిర్మాణాలతో పాటు పెద్ద ఎత్తున షాపింగ్ కాంప్లెక్స్‌లు రాబోతున్నాయని చెప్పారు. ప్రభుత్వం, అధికారులు సరైన చర్యలు తీసుకోకపోతే మోడ్రన్ స్లమ్ ఈ ఏరియాగా మారుతుందన్నారు. మురుగునీరు తోడుకోవలసిన దౌర్భాగ్యం ఈ ప్రాంత వాసులకు పట్టటం పట్ల ఆందోళన



మాట్లాడుతున్న పట్టణ పౌర సంక్షేమ సమాఖ్యరాష్ట్ర కన్వీనర్ సిహెచ్ బాబురావు

వ్యక్తం చేశారు. చీపురు పట్టుకుంటే స్వచ్ఛ ఆంధ్ర కాదని, తాడేపల్లి బైపాస్ లో ఉన్న మురుగు సమస్యను పరిష్కరించి స్వచ్ఛత అనిపించుకోవాలని అన్నారు. సదస్సులో అమరావతి ఐకాన్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్, హర్ష అపార్ట్మెంట్ అడుసుమిల్లి సత్యనారాయణ, అమరావతి ఐకాన్, పిన్నమనేని మురళీకృష్ణ, శశాంక్ ఐట్స్ విజయకుమార్, బిఆర్ఎల్ అపార్ట్మెంట్ సిహెచ్ శివరామిరెడ్డి, శ్రీసాయి బాలాజీ టవర్స్ కె.లక్ష్మయ్య, జొన్న శివశంకరరావు, అపార్ట్మెంట్ వాసులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లుగా రూ.7,800 జీతమే!

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్లకు రూ.18,500 జీతం, ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నామమాత్రపు గౌరవ వేతనం తీసుకుంటూ తొమ్మిదేళ్లుగా అంకిత భావంతో విధులు నిర్వహిస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్లకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ డిమాండ్ చేశారు. నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఏపీ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో పనిచేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్లు ప్రభుత్వ హాస్పిటల్లో ప్రసవమైన వారిని క్షేమంగా తమ ఇళ్లకు చేరుస్తున్నారన్నారు. 9 ఏళ్ల క్రితం అమలు చేసిన రూ.7800 ఇప్పటికీ ఇస్తున్నారని, అరకొర జీతాలతో కుటుంబాలను పోషించలేని దుస్థితిని అనుభవిస్తున్నారని చెప్పారు. ఈ నెల 31తో 102 తల్లీబిడ్డ వాహనాలు సమకూర్చిన అరబిందో సంస్థ టెండర్ ప్రక్రియ ముగియనున్న నేపథ్యంలో కొత్తగా టెండర్‌లకు పిలవనున్న దృష్ట్యా కెప్టెన్‌లకు రూ.18500 ఇచ్చేలా టెండర్ నిర్వహించాలన్నారు. దీనిపై ఇప్పటికే కెప్టెన్లు అనేకమార్లు యూనియన్ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు కలిసి విన్నవించారని గుర్తు చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎం.సాంబశివరావు, కార్యదర్శి రాము, కోశాధికారి అంకమ్మరావు, కెప్టెన్లు అజయ్, నాగరత్నం, మస్తాన్‌వలి, కోటేశ్వరరావు, బాబు, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రజావసరాలు తీర్చేలా బ్రిడ్జిని నిర్మించాలి

(మొదటి పేజీ తరువాయి)

సమాఖ్య నాయకులు కె.నళినీకాంత్, గుంటూరు ఇంటి గృహ యజమానుల సంఘం మూర్తి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కైలాస్‌నాథ్, సదాశివరావు, గురుదత్, మట్టుపల్లి సుబ్బారావు తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణ అమలు కోసం జెఎసి ఏర్పాటు చేశారు. ఈనెల 26న శంకర్ విలాస్‌లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమం నిర్వహించాలని, కరపత్రాలు విస్తృతంగా పంపిణీ చేయాలని, షాపుల వద్ద బ్యానర్లు ఏర్పాటు చేయాలని, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రకటించిన డిజైన్ ప్రకారం హిందూ కాలేజి నుండి లాడ్జి సెంటరకూ బ్రిడ్జి నిరించాలని కోరారు. తాము అందరం బ్రిడ్జికి వ్యతిరేకం కాదని, రాబోయే 50 ఏళ్ల కాలంలో ప్రజల అవసరాలు తీర్చే విధంగా బ్రిడ్జి ఉండాలన్నదే తమ అకాంక్షని చెప్పారు. ఇప్పుడున్న డిజైన్ ప్రకారం జిజిహెచ్‌కి వెళ్లేందుకు, బ్రాడీపేట-అరండల్‌పేట మధ్య సరైన అనుసంధానం లేదన్నారు. బడ్జెట్ పరిమితి పెట్టుకొని ఇంత వరకే బ్రిడ్జి కడతాం అని చెప్పటం సరికాదన్నారు. ప్రస్తుత డిజైన్‌లో స్లోప్ తక్కువ ఉండటం వల్ల సైకిల్‌పై వెళ్లే వారు, నడిచి వెళ్లే వారు కష్టంగా బ్రిడ్జి ఎక్కాల్సి ఉంటుందన్నారు. రాజధానికి వెళ్లే ప్రధాన మార్గంలో నిర్మించబోయే ఈ బ్రిడ్జి ఐకానిక్‌గా ఉండాలన్నారు. నిధులు చాలకుంటే ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించి, ప్రజలందరి ఆమోదించే డిజైన్‌తో ముందుకెళ్లాలని కోరారు. మూడు వంతనెలు మూసివేస్తేనే మూడు నెలలపాటు ట్రాఫిక్ సమస్య ఏవిధంగా ఉందో నగర ప్రజలు ప్రత్యక్షంగా చూశామని, ఇప్పుడు గుంటూరు తూర్పు-పశ్చిమ నియోజకవర్గాలకు అనుసంధానంగా ప్రత్యామ్నాయ మార్గాలు అభివృద్ధి చేసినట్లు ఎక్కడా కనిపించట్లేదని అన్నారు. డిజైన్‌ను పబ్లిక్ డొమైన్‌లో పెట్టకుండానే ఆదరాబాదరగా నిర్మాణం ప్రారంభించాలని చూడటం సరికాదన్నారు. రైల్వేలైన్ల అభివృద్ధి కోసం బ్రిడ్జి ఎత్తు పెంచి కడుతున్నారేగాని నగర ప్రజలను దృష్టిలో పెట్టుకొని కట్టట్లేదనే విషయం డిజైన్‌ను చూస్తే అర్థమవుతోందని విమర్శించారు. డిజైన్ మార్పుల కోసం జరిగే కార్యాచరణలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

డ్రెయినేజీ సమస్యలపై తాడేపల్లి పట్టణ వాసుల్లో తీవ్ర ఆవేదన

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడ నగరం కంటే మూడు రెట్లు పన్నులు అధికంగా వసూలు చేస్తున్నా సదుపాయాలు మాత్రం లేవన్నారు. రూ.లక్షల పెట్టి ప్లాట్ కొనుగోలు చేస్తే మురుగు కంపుతో పాటు దోమలను బహుమతిగా వచ్చాయని వాపోయారు. వర్షం వస్తే సిఎస్ఆర్ కళ్యాణ మండపం రోడ్‌లోని అపార్ట్మెంట్ల ముందు నిలబడ్డ నీరుతో కొన్ని బజారులో చేపలు పట్టొచ్చని కొందరు వ్యంగంగా వ్యాఖ్యానించారు.

సుమారు 160 అపార్ట్మెంట్లో 3400 ప్లాట్లు ఉన్న ఇక్కడ అంతే స్థాయిలో కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ ప్రాంతంలో లే అవుట్‌కు వదిలిన 20 సెంట్లు స్థలంలో మూడేళ్ల క్రితం నిర్మాణం మొదలుపెట్టిన వాటర్ ట్యాంక్ పనులు పునాది దశలోనే ఆగాపోయాయి. ఫలితంగా ఈ ప్రాంత అపార్ట్మెంట్ వాసులకు తాగునీరు సరఫరా కావడం లేదు. వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం వచ్చిన నిధులు గత ప్రభుత్వం వేరే నిధులకు మళ్లించినట్లు కొందరు ఆరోపిస్తున్నారు. ఎస్‌టిపిలు ఏర్పాటుచేసి మురుగునీరు బయటికి పంపటానికి మున్సిపల్ అధికారులు కొంత ప్రయత్నం చేసిన పూర్తిగా సఫలీకతం కాలేకపోయారని అపార్ట్మెంట్ వాసులు అంటున్నారు. ఎస్‌టిపిఎల్ దగ్గర ఏర్పాటు చేసిన మోటార్లు ఇంజిన్ ఆడుతూనే ఉన్నా మురుగు నీరు మాత్రం బయటికి పోదని స్థానికులు తెలిపారు. రోజు మొత్తం మీద మూడు నుంచి నాలుగు గంటలు మాత్రమే ఎస్టిపిల దగ్గర ఇంజన్ల ద్వారా నీరు బయటకి పోతోందంటున్నారు. మురుగును పంట కాల్వలోకి వదలడం ద్వారా ఎకరాల పంట నష్టపోతున్నామని రైతులు మధు ముందు తమ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కోర్టులో కేసు కూడా వేసినట్టు నూతక్కి గ్రామానికి చెందిన జొన్నల మహేశ్వర్‌రెడ్డి చెప్పారు.

నేడు రాజధాని రైతులతో ముఖాముఖి

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి రైతులు,గ్రామస్తులతో సి ఆర్ డి ఎ అధికారులు ముఖాముఖి చర్చలు జరిపేందుకు సమావేశం కానున్నారు.రాజధాని ప్రాంతం తుళ్లూరులోని హెచ్ ఎస్ ఆర్ కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు సమావేశం జరగనుంది.సమావేశంలో రైతులు, గ్రామస్తులతో రాజధాని నిర్మాణంలో వారి యొక్క సహకారం, భాగస్వామ్యం గురించి చర్చలు జరుగుతాయి. రాజధాని అమరావతి ప్రాంత సమగ్ర అభివద్ధిలో స్థానికుల భాగస్వామ్యాన్ని పెంపొంది ంచేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిఆర్‌డిఎ అధికారులు తెలిపారు.ఈ మేరకు సి ఆర్ డి ఎ కమ్యూనికేషన్ జాయింట్ డైరెక్టర్ జి రామరాజు ఆదివారం ప్రకటన విడుదల చేశారు.

పి4 ప్రారంభోత్సవ సభ ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని వెలగపూడి గ్రామంలో రాష్ట్ర సచివాలయం సమీపంలో ఈనెల 30వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలు, దాతలు, ప్రభుత్వం,భాగస్వామ్యం (పీ4) కార్యక్రమం ప్రారంభోత్సవంలో పాల్గొననున్నారు.ఈ నేపథ్యంలో ఏర్పాట్లను ఆదివారం జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి,ఆర్డీవో శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు.సభా ప్రాంగణం వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకుముందు రాష్ట్ర సచివాలయంలో మార్చి,25,26 వ తేదీలలో జరిగే జిల్లా కలెక్టర్ల సమావేశానికి సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. నిర్దేశించిన మేరకు అధికారులు ఏర్పాట్లను



పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్ రావు, జడ్పీ సీఈవో జ్యోతి బసు, డిఆర్‌డిఎ పీడీ విజయలక్ష్మి, పౌరసరఫరాల అధికారి కోమలి పద్మ, జిల్లా ఉపాధి కల్పనాధికారి దుర్గాబాయి, గుంటూరు పశ్చిమ మండల, తుళ్లూరు తహశీల్దార్ వెంకటేశ్వర్లు, సుజాత, తదితరులు పాల్గొన్నారు

కొలనుకొండ వద్ద మహిళ దారుణ హత్య

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కొలనుకొండ వద్ద మహిళను దారుణంగా గొంతు కోసి హత్య చేసిన సంఘటన వెలుగుచూసింది. ఆదివారం జరిగిన సంఘటన వివరాలు పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు హత్యకు చేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని చేరుకొని తాడేపల్లి పోలీసులు విచారణ చేపట్టారు.

పేకాట శిబిరం పై దాడి

ప్రజాశక్తి- తాడేపల్లి

గత కొంతకాలంగా గుట్టు చప్పుడు కాకుండా తాడేపల్లి పట్టణంలోని అంజిరెడ్డి కాలనీలో జరుగుతున్న పేకాట శిబిరంపై ఆదివారం తాడేపల్లి పోలీసులు దాడి చేశారు. పదిమంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. 30,800 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఆటో బోల్తా - ఏడుగురికి గాయాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఆటో అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో ఏడుగురు గాయపడ్డారు. ఈ సంఘటన సత్తెనపల్లి మండలం లయెలా ఇంజి నీరింగ్ కాలేజీ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో నల్లపాడుకు చెందిన దాసరి జోజి మరియదాసు మెండెం జోజి మహిమ రాజు చిన్నప్ప పోతురాజు శివ పెద్ద దెబ్బయ్య లు గాయపడ్డారు. నల్లపాడు నుండి 20 మంది ఆటోలో నాగార్జునసాగర్ సాగర్ మాత దేవాలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో గుంటను తప్పించే క్రమంలో ఆటో అదువుతప్పి బోల్తాపడటంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రాథమిక చికిత్స అనంతరం తీవ్రంగా గాయపడిన పోతురాజు శివ, చిన్నప్ప మరియదాసు ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలి ంచారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగినితో అసభ్యంగా ప్రవర్తించి మేనేజర్‌పై కేసు

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక బోస్ రోడ్ లోని ఓ మొబైల్ షోరూమ్ లో పని చేస్తున్న మహిళపట్ల అసభ్యంగా ప్రవర్తించిన మేనేజర్ పై కేసు నమోదు చేశారు. పట్టణ ఒన్ టౌన్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన యర్రంశెట్టి రాణి మొబైల్ షోరూమ్‌లో క్యాషియర్‌గా పని చేస్తోంది. షోరూమ్ మేనేజర్ వంశీ తనతో అసభ్యంగా ప్రవర్తించాడంటూ ఆమె పోలీసులను ఆశ్రయించటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థికాభివృద్ధిలో యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల పాత్ర గణనీయం

ప్రజాశక్తి-గుంటూరు



దేశంలోని ప్రధాన ఐదు ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఒకటైన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శతాబ్దంపైగా లక్షలాదిమంది ఉద్యోగుల సహకారంతో దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని ఆ బ్యాంక్ జోనల్ హెడ్ సయ్యద్ జవహర్ అన్నారు. ఆదివారం స్థానిక తాలూకా కార్యాలయం పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ యూనియన్ బ్యాంక్ పెన్షనర్స్ అండ్ రిటైరీస్ అసోసియేషన్ ఆవిర్భావ సభ, తొలి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జవహర్ మాట్లాడుతూ బ్యాంకుల పురోభివృద్ధికి సహకరించిన ఉద్యోగుల సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వం, యాజమాన్యాలు మరింతగా సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 35 నుండి 40 సంవత్సరాల పాటు శ్రమించిన బ్యాంకు ఉద్యోగుల సమస్యల పట్ల యాజమాన్యాలు, ప్రభుత్వాలు చిన్న చూపు చూడటం బాధాకరమన్నారు. ఉద్యోగుల సంక్షేమ నిధి మూడున్నర లక్షల కోట్ల రూపాయలకు పైగా ఉండగా తమకు రావలసిన పెన్షనల్లో కూడా కోత పెట్టడం సహించరాని అంశమన్నారు. 8 లక్షల మంది పైగా ఉన్న బ్యాంక్ ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రం కూడా తీసుకోవడానికి బ్యాంకు యాజమాన్యాలు నిరాకరించటం లక్షలాదిమంది ఉద్యోగులను అవమానించడమేనని అన్నారు. బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సంఘాలను గుర్తించడం యాజమాన్యాల బాధ్యతగా భావించాలన్నారు. సమావేశంలో విశ్రాంతి జనరల్ మేనేజర్, విశ్రాంత డిప్యూటీ జనరల్ మేనేజర్స్ డి చిరంజీవి, ఇ.పుల్లారావు, ఏవీఎస్ కష్ణమోహన్, కేజే శ్రీనివాసరావు, ఎల్‌ఐసి ఎంప్లాయీస్ యూనియన్ డివిజనల్ జాయింట్ సెక్రటరీ వీవీకే సురేష్, తదితరులు ప్రసంగించారు.

పిఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా రమేష్

ప్రజాశక్తి-గుంటూరు



నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న అసోసియేషన్ నాయకులు

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఆర్.వి.వి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఆదివారం జరిగిన సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. అనంతరం జరిగిన సమావేశ ంలో పదవి కాలం ముగిసిన 13 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు ఎంపిక ఏప్రిల్ 30 తేదీన జరుగుతుందని సమావేశం నిర్ణయించింది. ఈ సందర్భంగా బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంతోకాలంగా పంచాయతీరాజ్ శాఖలో పనిచేసిన ఉద్యోగుల పదోన్నతులు కల్పించాలని కోరారు. 50శాతం కోటాకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లకు ఎండివోలుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. రికార్డు, ల్యాబ్, లైబ్రరీ అసిస్టెంట్లకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ ట్రెజరర్ పి.దస్తగిరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు, కొండూరు శ్రీనివాసరావు, జిల్లాల పూర్వపు ఉపాధ్యక్షులు మురారి, సత్తిబాబు, శ్రీధర్‌బాబు, జి.ఎన్.ప్రసాద్, పూర్ణచంద్రారెడ్డి కె.సాగర్‌రెడ్డి పెంచలయ్య, చెంచురత్నం, మురళీ కష్ణరెడ్డి, బాబా వివిధ జిల్లాల కార్యదర్శి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

అత్తింటివారే చంపారని మృతురాలి బంధువుల ఆరోపణ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



భర్త వేధింపులు తాళలేక, అనుమానాస్పద స్థితిలో కుక్క మల్ల సౌందర్య (26) అనే యువతి మృతి చెందిన ఘటన ఎంటిఎంసి పరిధిలోని కుంచన పల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే కుంచనపల్లి గ్రామానికి చెందిన నల్లపు సంజీవరావు , విజయ కుమారి దంపతులకు ముగ్గురు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. శంకర్రావు వృత్తిరీత్యా ముంబైలోని నేవీ హార్బర్ లో ఉద్యోగం చేస్తూ ఇటీవల రిటైర్డ్ అయ్యారు. ముగ్గురు కొడుకులకు వివాహాలు చేయడంతో ఎవరికివారు వేరు కాపురాలు ఉంటున్నారు. ఒక్కగాన ఒక్క ఆడపిల్ల అవ్వడంతో కూతురు సౌందర్యను ఎంతో అల్లారు ముద్దుగా పెంచుతూ బీఎస్సీ కంప్యూటర్ చదివించాడు. 2022వ సంవత్సరం అదే గ్రామానికి చెందిన కుక్కమల్ల రాజు అనే యువకుడిని ప్రేమించానని పెళ్లి చేసుకుంటానని ఇంట్లో నుండి వెళ్లి, తాను ప్రేమించిన రాజును పెళ్లి చేసుకొని, తల్లిదండ్రులకు దూరంగా అదే గ్రామంలో భర్తతో జీవనం సాగిస్తుంది. ఇటీవల ప్రాతూరు గ్రామంలోని ఎ మి ఇంటర్నేషనల్ స్కూల్లో టీచర్ గా సౌందర్య పనిచేస్తూ ఉంది. సౌందర్యని ప్రేమించి పెళ్లి చేసుకున్న రాజు, కుటుంబ సభ్యులు కట్నం తేలేదని, డబ్బులు కోసం చీటికిమాటికి సౌందర్యను మాటలతో చిత్రహింసలు పెడుతుండేవారని తెలిసింది. శనివారం రాత్రి తన భర్త వేధిస్తున్నాడని తండ్రి సంజీవరావు కు మృతురాలు సౌందర్య ఫోన్ చేసి చెప్పింది. ఆదివారం ఉదయం బాత్రూంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసు కుందని సౌందర్య అత్తింటివారు తెలపడంతో సౌందర్య తండ్రి సంజీవరావు, ఆయన కొడుకులు సౌందర్య నివాసం ఉండే ప్రాంతానికి వెళ్లి చూడగా, అప్పటికే సౌందర్యను ఆస్పత్రికి తరలించారని అక్కడ స్థానికులు చెప్పడంతో మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రికి వెళ్లారు. అయితే అప్పటికే సౌందర్య మృతి చెందిందని వైద్యులు తెలిపారు. సౌందర్యను భర్త, భర్త తరపు కుటుంబ సభ్యులు వేధిస్తుండడంతో తన కూతురు సౌందర్య అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందని సౌందర్య తండ్రి సంజీవరావు కన్నీరు మునీరయ్యాడు. సౌందర్య మృతదేహానికి ఆదివారం కావడంతో శవ పంచనామా జరగలేదు. మృతురాలి తండ్రి సంజీవరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్

మొక్కపాడులో ఎద్దువాగుపై బ్రిడ్జికి శంకుస్థాపన

ప్రజాశక్తి - రాజుపాలెం

మండలం లోని మొక్కపాడు గ్రామంలో ఎద్దు వాగుపై రూ.5.60 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ, మాజీ జెడ్‌పిటిసి మర్రి వెంకట రామిరెడ్డి, సర్పంచ్ కనదం పద్మశ్రీనివాసరావు టిడిపి మండల అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, నాయకులు మన్నెం శివనాగమల్లేశ్వరరావు, పూజల కోటయ్య పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న పోలూరి నరసింహారావు

పి4 సర్వేపై అభిప్రాయ సేకరణ సభ

ప్రజాశక్తి - మాచర్ల

పేదరికం లేని సమాజ స్థాపనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రైవేటు భాగస్వామ్యంతో పీ4 సర్వే చేపట్టిందని మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. మాచర్ల పట్టణం 20 నుండి 26వ వార్డులకు సంబంధించి పీ4 సర్వేలో భాగంగా ప్రజాభిప్రాయ సభ శ్రీహర్ష స్కూల్‌లో ఆదివారం జరిగింది. కార్యక్రమంలో ఛైర్మన్ పోలూరి నరసింహరావు మాట్లాడుతూ పేదలకు ఆర్థిక సాధికారత చేకూర్చడం, జీవన ప్రమాణాల్లో అట్టడుగు స్థాయిలో వున్న 20 శాతం మంది పేదలను గుర్తించడం ద్వారా పేదరికాన్ని దూరం చేయాలన్నది పీ4 సర్వే ఉద్దేశమన్నారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు, జనసేన నాయకులు లాల్‌కృష్ణ, టిడిపి నాయకులు కోమటి వీరు, దొడ్డ చందు, పచ్చిపాల అనురాధ, మెప్మా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాచర్ల - బెంగుళూరు బస్ సర్వీస్ రద్దు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్ల నుండి బెంగుళూరు వెళ్ళ సూపర్ లగ్జరీ బస్ సర్వీస్‌ను ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. రానున్న రోజుల్లో మాచర్ల నుండి చెన్నై బస్ సర్వీసు కూడా రద్దు చేస్తారని తెలుస్తోంది. గతేడాది మాచర్ల నుండి కర్నూల్ అల్ట్రా డీలక్స్ బస్ సర్వీస్ రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయమై ఆర్టీసీ డిఎం బత్తుల వీరస్వామిని వివరణ కోరగా బెంగుళూర్, కర్నూల్ ఆర్టీసీ సర్వీసులు నడపడం వల్ల నష్టాలు వస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ప్రైవేట్ సర్వీస్‌ల వైపు మొగ్గుచూపుతున్నట్లు చెప్పారు.

భగత్‌సింగ్‌కు నివాళులు

ప్రజాశక్తి - అమరావతి



భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రమైన అమరావతిలో నివాళులర్పించారు. వారి చిత్రపటాలకు పూలమాలలేశారు. సిపిఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమాలు







ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భగత్‌సింగ్ స్ఫూర్తితో పీడిత వర్గ ప్రజల సంక్షేమం కోసం ఉద్యమిస్తామని సిఐటియు నాయకులు గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భగత్‌సింగ్ 94 వర్ధంతి సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ పూలమాలవేసి నివాళులర్పించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ పాత్ర చాలా కీలకమన్నారు. దేశంలో మతోన్మాద రాజకీయాలను బిజెపి రెచ్చగొడుతోందని, లౌకికవాదానికి తూట్లు పొడుస్తోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రజాసమస్యలు పక్కకెళ్తున్నాయని, స్వాతంత్ర్య స్ఫూర్తి దెబ్బతింటోందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడి తిప్పికొడదామన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.శివకుమారి, సిలార్ మసూద్, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు. ఎంసిపిఐయు ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్ బాషా, సిపిఐ కార్యాలయంలోభగత్‌సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఐ నాయకులు కాసా రాంబాబు, ఉప్పలపాటి రంగయ్య మాట్లాడారు. అంతరాలు లేని సమాజం కోసం, బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించి ఆత్మబలిదానం చేసిన స్వాంతంత్ర్య సమరయోధులు, దేశభక్తులు, విప్లవస్ఫూర్తి ప్రదాతలు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ అని కొనియాడారు. భగత్‌సింగ్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు.

పప్పుల సాగులోనూ అప్పులే!

- మార్కెట్ మోసంతో ధర పతనం
- నిబంధనల వల్ల కొనుగోలు కేంద్రాలకు దూరం
- నష్టాల గట్టెక్కలేని కందిరైతులు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

కొన్నేళ్లుగా పత్తి పంట వేసి నష్టపోతన్న రైతులు ప్రత్యామ్నాయంగా ఈ ఏడాది కంది పంట సాగుకు మొగ్గుచూపారు. మరికొంత మంది రైతులు మొదటగా పత్తి పంట సాగు వేసినా పైరు చీడ పురుగులు, తెగుళ్ల బారిన పడటంతో రెండు మూడు నెలల తరువాత ఆ పైరును తొలగించి దాని స్థానంలో కందిపంటను సాగు చేశారు. కందిని అంతరపంటగా పండించే రైతులు కూడా ఈ ఏడాది పూర్తి స్థాయి సాగు చేపట్టారు. దాంతో గతంలో కంటే రెట్టింపు విస్తీర్ణంలో పల్నాడు జిల్లాలో కంది పంట సాగైయింది. జిల్లాలో సాధారణంగా కందిపంట సాగు అంచనా 6,662 ఎకరాలుకు కాగా ఈ ఏడాది 10,615 ఎకరాల్లో సాగైంది. అయితే లాభాలపంట పండిస్తుంది అనుకున్న కంది కూడా రైతులను నష్టాల బాట నుండి తప్పించలేకపోయింది. పెట్టుబడి ఖర్చులైనా రాక రైతు అప్పులు రెట్టింపయ్యాయి.



కందులను జల్లెడ పడుతున్న రైతు, కూలీలు

తగ్గిన దిగుబడి.. పెరిగిన పెట్టుబడి..

కంది సాగుచేసే నాటికి కంది ధరలు అధికంగా ఉండటంతో రైతులు ఎంతో ఆశతో ఈ ఏడాది కందిని వేశారు. భూమి దుక్కి దున్నడం నుంచి విత్తనాలకు, విత్తుకోవడం, ఎరువులు, రసాయనిక మందులు, కోతపనులు, కలుపుతీత కూలీల ఖర్చుల వరకు అన్ని ధరలు పెరిగిన నేపథ్యంలో ఎకరానికి రూ.25 వేలకు పైగా పెట్టుబడి అయ్యింది. పైరును జాగ్రత్తగా కాపాడుకుంటుండగా నవంబరు, డిసెంబర్ మాసాల్లో తుపానుల వల్ల పూత, పిందె రాలిపోవటంతోపాటు కంది పైర్లకు తెగుళ్ల సోకి వైరస్ బారిన పడ్డాయి. పంటకు సోకిన వైరస్ తెగులు నివారణకు రైతులు రూ.వేలు ఖర్చుపెట్టి రసాయనిక మందులను పిచకారీ చేసినా ఫలితం లేకుండా పోయింది. ఎకరాకు నాలుగైదు క్వింటాళ్ల రావాల్సిన దిగుబడి మూడు క్వింటాళ్లకు పడిపోయింది.

ధరలు పతనం.. అరకొరగా మద్ధతు ధర

పుండు మీద కారంలా ధరల పతనం రైతుల నష్టాలను ఇంకా పెంచింది. గతేడాది క్వింటాళ్ రూ.10వేలు పలకగా ఈసారి రూ.6000-6,500కు మించడం లేదు. కూలీ ఖర్చులు కూడా రావటం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం క్వింటాళ్‌కు కనీస మద్దతు ధర రూ.7,550గా నిర్ణయించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నా రూ.9 వేలైనా ఉండాలని రైతులు కోరుతున్నారు. దీనికితోడు పంట నాణ్యత, తేమశాతం తదితర నిబంధనలు కారణంగా కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోలేక ప్రైవేటు వ్యాపారులనే రైతులు ఆశ్రయిస్తున్నారు.

అధికారులేం చెబుతున్నారు..

గ్రామంలోని ప్రతి రైతు సేవా కేంద్రం ద్వారా కంది పంటను కొనుగోలు చేస్తున్నామని, మొదటగాఈ-క్రాప్ బుకింగ్, ఇకెవైసి పూర్తయిన రైతులు పంటను అమ్ముకోవడానికి రైతుసేవా కేంద్రాల్లో తమ పేరును రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ఆ తరువాత కొనుగోలు షెడ్యూల్డు తేదీని ఇస్తామని అధికారులు చెబుతున్నారు. రైతులు బేడ లేకుండా నాణ్యమైన కందులు తీసుకురావాలని, పంట నూర్పిడి చేసిన వెంటనే తీసుకొస్తే పచ్చిగా ఉంటాయి కాబట్టి ఆరబెట్టుకొని తేమ శాతం ఎక్కువ లేకుండా తేవాలని అంటున్నారు. రైతులకు గన్ని బ్యాగులు, కూలి ప్రభుత్వమే భరిస్తుందని, పంటను కొన్న వారం పది రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

రైతులేమంటున్నారు..

బయట మార్కెట్లో రూ. 6000 నుండి రూ. 6500 వరకు ధర వస్తుంది. పంటను మరోచోటకు తరలించే పనిలేకుండా పంట నూర్పిడి జరిగిన వెంటనే నేరుగా కళ్లాల వద్దే వ్యాపారులు కొంటున్నారు. నాణ్యత, తేమ శాతం అవేమి పట్టించుకోకుండా వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారు. బేడ లేకుండా జల్లెడ పట్టి ఆరబెట్టాలంటే ఇద్దరు సొంత మనుషులతో బాటు మరొకరుని కూలీకి తీసుకోవాలి కూలీ ఒకరికి రూ.400, ఇద్దరైతే రూ.800 అవుతుంది. ఈ ఎండలకు కళ్లాల్లో ఆరబెడితే తేమ శాతం తగ్గటంతో బాటు పంట తూకం కూడా బాగా తగ్గుతుంది. ఇలా చూసుకుంటే ప్రైవేటు వ్యాపారులు ఇచ్చే ధర ప్రభుత్వం ఇచ్చే ధరకు సమానమవుతోంది. పంట అమ్మిన తరువాత డబ్బులు కోసం పది రోజులు వేచి చూడనక్కరలేకుండా వ్యాపారస్తులు కొనుగోలు చేసిన వెంటనే డబ్బులు చేతిలో పెడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో అమ్మాలని ఉన్నా అక్కడ నిబంధనల వల్ల అమ్మలేకపోతున్నాం.

మార్కెట్లో కిలో కందిపప్పు రూ.120

సామాన్య ప్రజలు రిటైల్ మార్కెట్లో నాణ్యతను బట్టి కిలో కంది పప్పు రూ.100 నుండి 120లకు కొనుగోలు చేస్తున్నారు. అంటే క్వింటాళ్ రూ.10-12 వేలు పడుతోంది. రైతులు తమ పంటను అమ్ముకొన్న ధరకు బహిరంగ మార్కెట్లో సామాన్యుడు కొనే ధరకు రూ.4,500 వ్యత్యాసం ఉంటోంది. సగానికి సగం ధరల వ్యత్యాసంతో అటు రైతులు, ఇటు సామాన్యుడు నష్టపోతున్నారు. లాభాలు మాత్రం మధ్యవర్తులు కాజేస్తున్నారు.

కష్టానికి కూలీ కూడా రాదు

మూలా బ్రహ్మారెడ్డి, రైతు, కొత్తపల్లి గ్రామం.



నాలుగెకరాల సొంత పొలంలో కంది పంటను వేశాను. ఎకరాకు 4 క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. పంటకు పెట్టుబడి ఎకరాకు రూ.25 వేల చొప్పున రూ.లక్ష అయ్యింది. పంట ధరలు చూస్తే చేసిన కష్టానికి కూలీ కూడా దక్కేలా కనిపించటం లేదు. నాణ్యత, తేమ వంటి షరతులు లేకుండా ప్రభుత్వం క్వింటాళ్‌కు రూ.9 వేలుకు కొలుగోలు చేస్తే నష్టాలు లేకుండా బయటపడతాం.

అరకొరగానే కొనుగోళ్లు

దశబంధపు కొండలు, ఉపసర్పంచ్, కొత్తపల్లి గ్రామం



మాచర్ల మండలంలో అధికంగా కంది పంట వేసింది మా గ్రామంలోనే. అటువంటి మా ఊర్లో ఇప్పటి వరకు ప్రభుత్వం తరుపున కందులు కొన్న దాఖలాలు లేవు. బయట వ్యాపారస్తులే కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసినా అరకొరగానే తప్ప పూర్తి స్థాయిలో కాదు. రైతులకు ఈ మద్దతు ధర సరిపోదు. ఈ విషయంపై కొత్తపల్లి గ్రామ అగ్రికల్చర్ విలేజ్ అసీస్టెంట్ శ్రావణిని ప్రశ్నించగా ఇప్పుడిప్పుడే రైతులు పంట అమ్మకం కోసం వస్తున్నారని, వారి పేర్లు ఆన్‌లైన్ చేస్తున్నామని చెప్పారు.

దేశానికి భగత్‌సింగ్,రాజ్‌గురు,సుఖ్‌దేవ్ వారసులు కావాలి

జిల్లాలో ఘనంగా నివాళులర్పించిన సిపిఎం, ప్రజాసంఘాలు నాయకులు


ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో


ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

తనకు క్షమాభిక్ష అవకాశం ఉన్న ఉరికొయ్యను ముద్దాడిన విప్లవ యోధుడు భగత్ సింగ్ అని, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి అన్నారు. ఆదివారం ఎంటిఎంసీ పరిధిలోని కొలనుకొండ ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో విప్లవ వీరుడు భగత్ సింగ్ 99 వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి డి రమాదేవి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ నా రక్తం వధా కాదని, నా మృత్యువు వృధా కాదు, నా నెత్తురు కోనేరులో నవలోకం వికసించును అని భగత్ సింగ్ మాటలు స్ఫూర్తిగా నిలిచాయని ఆమె అన్నారు. నిరంతరం భగత్ సింగ్ స్ఫూర్తితో కార్పొరేట్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా, ప్రజా సమస్యల పైన ప్రతి ఒక్కరూ పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఐద్వ రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి మాట్లాడుతూ భారత జాతీయ ఉద్యమ నాయకత్వం రాజీ ధోరణిలో ఉన్న సమయంలోనే రష్యాలో లెనిన్ సారధ్యంలో సోషలిస్టు విప్లవం విజయవంత మైందని, ఆ ప్రభావం భారతదేశ పై కూడా పడిందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ట్రెజరర్ వి.సావిత్రి, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఆత్మకూరులో

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సర్దార్ భగత్ సింగ్ 94 వర్ధంతి సందర్భంగా ఆత్మకూరు గ్రామంలోని యువజన సంఘం ఆధ్వర్యంలో ఆత్మకూరు గ్రామ సెంటర్ లోని భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహాలకు యువజన సంఘం నాయకులు ఆనందం వెంకట్రావు, తమ్మిశెట్టి దుర్గాప్రసాద్, వాసి పార్థసారధి, సీనియర్ నాయకులు ముసలి పకీరయ్య పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మాజీ నాయకులు పండల ప్రసాద్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం దోపిడి పీడనకు వ్యతిరేకంగా చిన్న వయసులోనే ఉరితాడును ముద్దాడి అమరులైన భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవ్ జీవితాలను యువత అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదంతో దేశంలోని యువతను స్వతంత్ర పోరాటంలో ఉవ్వెత్తున పాల్గొనేలా చేసింది భగత్ సింగ్ సమ సమాజం నిర్మాణం జరగాలని కోరుకున్నాడని, ఆ సమ సమాజం కోసం నేటి యువత కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ మాజీ నాయకులు ముసలి జ్యోతిబాస్, వుద్దంటి దుర్గారావు, బిట్ర రాంబాబు, రాఘవయ్య, గడ్డం అజయ్, జనార్ధనరావు, సీతారామాంజనేయులు,వద్ది సురేష్, గుద్దంటి కష్ణ, మునగాల శ్రీను పాల్గొన్నారు.


మంగళగిరి లో

ప్రజాశక్తి - మంగళగిరి

భారతదేశ యువతకు నిరంతర పోరాట స్ఫూర్తి భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురువులని డివైఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. ఆదివారం మంగళగిరి గాలిగోపురం సెంటర్లో గల అమరవీరులు భగత్ సింగ్, సుఖదేవ్ రాజ్ గురు వర్ధంతి సందర్భంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే దేశం కోసం బ్రిటిష్ సామ్రాజ్యవాదులపై తిరుగుబాటు చేసి ప్రాణాలను అర్పించారని అన్నారు. వారి స్ఫూర్తితో యువత నేడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వ మతోన్మాద చర్యలను వ్యతిరేకిస్తూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గత 11 సంవత్సరాల్లో ఎన్డీఏ పాలనలో భారత దేశంలో ఉన్న అన్ని విభాగాల్లో మతతత్వ వాదాన్ని పెంచుతున్నారని విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందని అన్నారు. ఇటీవల పవన్ కళ్యాణ్ జనసేన ఆవిర్భావ సభలో మతోన్మాదాన్ని బలపరుస్తూ మాట్లాడటం దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు ఎస్ గణేష్, ఎం నాగేశ్వరావు, ఎం బాలాజీ, మాజీ డివైఎఫ్ఐ నాయకులు జెవి రాఘవులు, వివి జవహర్లాల్, ఎస్ ఎస్ చంగయ్య, కే శ్రీనివాసరావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పి బాలకష్ణ, ఎస్ కోటేశ్వరరావు, వై కమలాకర్, షేక్ వలి, ఎం వి సుబ్బారావు, జి మహేష్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

భగత్ సింగ్ సుఖదేవ్ రాజ్ గురు ల 94వ వర్ధంతి దుగ్గిరాల మండల కేంద్రంలో సిపిఎం కార్యాలయంలో గొర్రెపాటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. తొలిత సిపిఎం పార్టీ మండల నాయకులు వై. స్టాలిన్ భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ వర్ధంతి సభకు ముఖ్యఅతిథిగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్, సుఖదేవ్, రాజగురులు భారత సమాజం అసమానతలు లేని సమాజంగా ఉండాలని, ధనిక పేద తేడా లేని సమాజంలో అందరికీ విద్య ,ఉద్యోగం ,కూడు గుడ్డ అందాలని కోరుకున్నారని, బ్రిటిష్ సామ్రాజ్యవాదం నుండి భారతదేశాన్ని విముక్తి చేసేందుకు ప్రాణ త్యాగాలు చేశారని తెలిపారు. భగత్ సింగ్ కులమతాలకు అతీతంగా భారతదేశం లో స్వేచ్ఛ వాయులు వెలిగరయాలని ,భారతదేశం ప్రపంచంలో అత్యున్నత దేశంగా ఎదగాలని కోరుకున్నారని వారు లెనిన్ వ్రాసిన రాజ్యము విప్లవం గ్రంథాన్ని చదివి ప్రభావితులయ్యారని తెలిపారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేశారని వారి ఆశయాలను లక్ష్యాలను నేటి యువత ముందుకు తీసుకుపోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జెట్టి బాలరాజు నాయకులు చిరంజీవి, బి. అమ్మిరెడ్డి కార్తీక్, మహేష్ పాల్గొన్నారు.


దుగ్గిరాలలో


తెనాలిలో

ప్రజాశక్తి-తెనాలిరూరల్

భారతదేశ స్వేచ్ఛ స్వాతంత్రం కోసం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ఉరికొయ్యలను ముద్దాడిన విప్లవ వీరుడు భగత్ సింగ్ 94వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన వర్ధంతి సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబు ప్రసాద్, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి జి ప్రసాద్ భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. తాను దేశంకోసం ప్రాణాలర్పించిన సన్నివేశాలను వివరించారు. విశ్రాంత సైనికులు టి శ్రీనివాసరావు, పౌర హక్కుల పరిరక్షణ సంఘం బి బ్రహ్మానంద రెడ్డి, ప్రజా చైతన్య ఐక్య వేదిక ఆర్ శివకృష్ణ, ఉల్లగంటి శ్రీనివాసరావు విప్లవ జోహార్లు పలికారు.


మేడికొండూరులో

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని పేరేచర్ల జంక్షన్లో ఆదివారము స్వాతంత్ర సమరయోధుడు అఖ్యాత ఉద్యమకారుడు సర్దార్ భగత్ సింగ్ 94 వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కే.అజయ్ కుమార్ పాల్గొని భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మేడికొండూరు నాయకులు బొట్ల రామకృష్ణ, సిఐటియు మండల కార్యదర్శి ఎస్ ఎం భాష, సుధాకర్ రెడ్డి, సంజీవరెడ్డి, జాన్ పీరా పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడు లోని తేళ్ల నారాయణ కేంద్రంలో భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడారు. కార్యక్రమంలో సభ్యులు ముద్దన వెంకటేశ్వర్లు, నల్లమోతు రాజేంద్ర, మర్రి లక్ష్మి, షేక్ షమీ, పి భువనేశ్వరి, కన్నెగంటి చంద్ర రావు, పోపూరి సుధీర్, పంగులూరు హరిబాబు, గద్దె మల్లేశ్వరరావు, మచ్చా పున్నారావు పాల్గొన్నారు.





ఉరికొయ్యను ముద్దాడిన విప్లవ యోధుడు భగత్‌సింగ్

ప్రజాశక్తి- తాడేపల్లి

భగత్ సింగ్ వారసత్వం నేటి యువతీ యువకులు కొనసాగించాల్సిన అవసరం ఉందని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామన్న చెప్పారు. భగత్ సింగ్ వర్ధంతి సభ ఆదివారం ప్రజా నాట్యమండల ఆధ్వర్యంలో తాడేపల్లి మేక అమరా రెడ్డి భవన్లో నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు రామన్న మాట్లాడుతూ మోడీ కార్పొరేట్ విధానాలు వల్ల యువత భవిష్యత్ అంధకారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్ కుమార్, ఎం రవి, ఆర్వి రాఘవయ్య, శ్రీనివాసరావు, పద్మ, కే సాంబశివరావు, డప్పు శ్రీను పాల్గొన్నారు.



ప్రజాశక్తి- తాడేపల్లి : మతోన్మాద విష కోరలు పడ గ విప్పిన నేపథ్యంలో భగత్ సింగ్ లాంటి దేశభక్తులు నేడు దేశానికి అవసరమని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కృష్ణ కాంత్ చెప్పారు. భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ప్రకాష్‌నగర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ వాడిని దేశం నుండి తరిమేయడానికి భగత్ సింగ్ లాంటి వీరులు ప్రాణ త్యాగం చేస్తే, నేడు బిజెపి పల్లకిలో వారి వారసులను తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శిం చారు. భగత్ సింగ్ స్ఫూర్తితో యువత కదలాలని కోరారు. కార్యక్రమంలో బూరుగ వెంకటేశ్వర్లు, ఏ అనిల్, ధనుష్, మహేంద్ర, అభిషేక్, శ్రీకాంత్, ఎన్ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



వీరనారి ఐలమ్మ కళ్యాణమండపం ప్రారంభం

ప్రజాశక్తి- తాడేపల్లి

వీరనారి ఐలమ్మ పేరుతో ఉండవల్లి అమరా రెడ్డి నగర్ లో పూర్తయిన రజక వృత్తిదారులు నిర్మించిన కళ్యాణ మండపాన్ని ఆదివారం రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం భాస్కరయ్య ప్రారంభించారు. అనంతరం వృత్తిదారుల సంఘం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో భాస్కరయ్య మాట్లాడుతూ ఈ కళ్యాణ మండపం సామాజిక విజ్ఞానిక కేంద్రంగా కూడా విరాజిల్లుతుందని ఆకాంక్షించారు. సాంస్కృతిక కేంద్రంగా విరాజిల్లుతుందని తెలిపారు. రాబోయే భవిష్యత్ తరాలకు ఉపయోగపడుతుందని చెప్పారు. బీసీ వెల్ఫేర్ హాస్టల్ అధికారి సుమిత్ర దేవి మాట్లాడుతూ ఉండవల్లిలో కళ్యాణ మండపం నిర్మించుకోవడం తమకు స్ఫూర్తి నింపిందని చెప్పారు. రజక ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాకర్ల రాము మాట్లాడుతూ ఐక్యంగా నిలబడి అందరూ కలిసికట్టుగా కళ్యాణమండపం పూర్తి చేసుకోవటం శుభ పరిణామం అన్నారు. మంత్రి నారాలోకేష్ సహాయ సహకారాలు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెనాలి కౌన్సిలర్ వి విజయలక్ష్మి, రాజధాని రైతు నాయకులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి, నూతక్కి శ్రీనివాసరావు, జంగాల సాంబశివరావు, కళ్ళం సంజీవరెడ్డి, జొన్న రామలింగేశ్వరరావు, బొజ్జ సుబ్బారావు, ఈమని రామారావు, శివయ్య, పార్థసారథి, ఓ శ్రీనివాసరావు, చెంచయ్య, కే వెంకటేశ్వరరావు, మస్తాన్ రావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి-గుంటూరు

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని గతేడాది పోరాటం సందర్భంగా యూనియన్‌తో ప్రభుత్వం చేసిన ఒప్పందం మేరకు జీవోలు జారీ చేయాలని ఏ.పి ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మి డిమాండ్ చేశారు. పి.ధనలక్ష్మి అధ్యక్షతన సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగిన యూనియన్ సమావేశంలో లక్ష్మి మాట్లాడుతూ గత ఆరేళ్లుగా ఆశా వర్కర్లుకు జీతాలు పెరగలేదని, ఈ కాలంలో ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచిందని, నిత్యావసరాలు, ఇతర అన్ని రకాల వస్తువుల ధరలూ, ఇంటి అద్దెలు, పిల్లలు ఫీజులు అనేక రెట్లు పెరిగాయన్నారు. వేతనాలు పెంచకపోతే పెరిగిన ధరలతో ఏవిధంగా బ్రతకాలని ప్రశ్నించారు. ఆశాల సమస్యలపై ఎన్నిసార్లు విన్నివించినా ప్రభుత్వం చర్చలు జరపట్లేదన్నారు. గతేడాది ఆందోళన సందర్భంగా ప్రభుత్వ ఒప్పందం ప్రకార రిటైర్మెంట్ వయస్సు పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్, చనిపోయిన ఆశ వర్కర్లకు అంత్యక్రియల ఖర్చులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒప్పందం జరిగి ఏడాది పూర్తి అయినా జీఓలు అమలు కాలేదని, ఈ కాలంలో అనేక మంది రిటైర్ అయ్యారని, చనిపోయిన వారి కుటుంబాలకు ఎలాంటి పరిహారం అందలేదన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి వై.రమణ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఆశ వర్కర్లు సహా చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు సర్వసాధారణం అయ్యాయని, సంఘటితమై ప్రతిఘటించడం ద్వారానే వీటిని నిలుపుదల చేయగలమని అన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ల పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి పిహెచ్‌సి, జిల్లా స్థాయిలలో గ్రీవెన్స్‌లు నిర్వహించాలని కోరారు. లేబర్ కోడ్‌ల అమలుకు వ్యతిరేకంగా మే 20న జరిగిన దేశావ్యాప్త సమ్మెలో ఆశా వర్కర్లు అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు కె.జ్యోతి, జయప్రద, శ్యామల, సుజాత, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మి



మాట్లాడుతున్న ఎంపీడీవో స్వరూపరాణి

నాదెండ్లలో ఘనవ్యర్థాల నిర్వహణపై శిక్షణ

ప్రజాశక్తి నాదెండ్ల

మండల కేంద్రం నాదెండ్లలో సోమవారం నుండి శుక్రవారం వరకు ఐదు రోజులపాటు ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం జరగనున్నట్లు నాదెండ్ల ఎంపీడీవో స్వరూప రాణి తెలిపారు. ఆదివారం నాదెండ్ల గ్రామంలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ఉన్నతాధికారులు నియోజకవర్గ స్థాయి స్థానిక శిక్షణ కేంద్రంగా ఎంపిక చేయడంతో నియోజకవర్గంలోని మూడు మండలాల అధికారులు, సిబ్బంది నాదెండ్లలో జరిగే శిక్షణ కార్యక్రమానికి హాజరవుతున్నట్లు ఆమె వివరించారు. మండలాల వారీగా జరిగే ఈ కార్యక్రమంలో సోమవారం నాదెండ్ల మండలం, మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు చిలకలూరిపేట, గురు, శుక్రవారాలు ఎడ్లపాడు మండలాల్లో చెందిన ప్రభుత్వ యంత్రాంగం హాజరుకానున్నట్లు స్వరూప రాణి తెలిపారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎమ్మార్సీలు, క్లాప్ మిత్రాలు, గ్రీన్ గార్డులు హాజరుకానున్నారు.




నిత్యావసర వస్తువులు అందజేస్తున్న లగడపాటి శ్రీనివాస్

నిత్యావసర వస్తువులు అందజేత

ప్రజాశక్తి - వినుకొండ

పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని పేద ముస్లిం మహిళలకు రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి, సినీ నిర్మాత లగడపాటి శ్రీనివాస్ నిత్యావసర వస్తువులు అందజేశారు. ప్రతి ముస్లిం కుటుంబం సంతోషంగా పండుగ జరుపుకోవాలనే దైవ ప్రవక్త సందేశాన్ని ఆచరిస్తూ ప్రతి సంవత్సరం నిత్యావసర వస్తువులు అందజేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ జానీ, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ షేక్ ఫారుక్, పట్టణ టిఎన్టియుసి అధ్యక్షులు షేక్ అక్బర్‌బాషా, లగడపాటి శ్రీనివాస్ యువత, ముస్లిం మహిళలు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న శివశక్తి ఫౌండేషన్ సభ్యులు

బోనాల పండుగకు విరాళమిచ్చిన శివశక్తి ఫౌండేషన్

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని 12వ వార్డు అంబేద్కర్ కాలనీలోని మహాలక్ష్మమ్మ అమ్మవారి బోనాల పండుగను జరుపుకోవాలని ప్రభుత్వ చీఫ్‌విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు కోరారు. ఆయన ఆదేశాల మేరకు శివశక్తి ఫౌండేషన్ సభ్యులు ఆదివారం మహాలక్ష్మి గుడి నిర్వాహకులను కలిసి ఫౌండేషన్ తరఫున 25 వేలు విరాళాన్ని అందజేశారు. బోనాలు పండుగను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని, వర్షాలు సమద్ధిగా కురిసి పంటలు బాగా పండి ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని వారు కోరారు. కార్యక్రమంలో శివశక్తి ఫౌండే షన్ మేనేజర్ రమేష్, సౌదా, జానీ కౌన్సిలర్ పులినాగరాజు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

దడపుట్టిస్తున్న వీధి కుక్కలు...ఆందోళనలో ప్రజలు

నెలలో కుక్కకాటు బాధితులు 200మంది.... పట్టించుకోని అధికారులు



కాలిపై కుక్క కరవడంతో ఏర్పడిన కాటు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల:

పట్టణ, మండల పరిధిలోని గ్రామాలలో వీధి కుక్కలు సైర్య విహారం చేస్తున్నాయి. రోడ్లపై పదుల సంఖ్యలో ఉంటూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. పిడుగురాళ్ళ పట్టణ, మండల పరిధిలో రోజుకి 3 నుండి 4వరకు కుక్క కాటు కేసులు నమోదవుతున్నాయి. నెల రోజుల వ్యవధిలో 200పైగా కుక్క కాటు కేసులు నమోదవుతున్నట్లు ఆరోగ్య శాఖ అధికారులు తెలుపుతున్నారు. ఎక్కువగా చిన్నారులు, వృద్ధులపై కుక్కలు దాడులు చేస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇల్లు వదిలి బయటకు వెళ్ళాలంటే భయపడుతున్నారు. అధికారులు పట్టించు కోకపోవడంతో కుక్కల సంఖ్య నానాటికి పెరిగి పోతూనే ఉంది. ఒక్కో విధిలో సుమారుగా 20కి పైగా కుక్కలు ఉంటున్నాయి.



వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

రోడ్డుపై వెళుతున్న వారిపై, ద్విచక్ర వానదారులపైనా కుక్కల దాడులు పెరిగిపోయాయి. ప్రతి సంవత్సరం కుక్కలు, కోతులను నివారించేందుకు ప్రభుత్వం కొంత నిధులు కేటాయించి చర్యలు తీసుకుంటారు. ఇటీవల ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కుక్కల నివారణకు



రోడ్డుపై వాహనదారులకు అడ్డుగా ఉన్న కుక్కలు

ప్రభుత్వం గతంలో ప్రయివేట్ ఏజెన్సీలకు కొంత మెత్తంలో చెల్లించే వారు కుక్కలను పట్టుకుని పట్టణానికి దూరంగా వేరే ప్రాంతాలకు లేదా అటవీ ప్రాంతాలకు తీసుకెళ్ళి వదిలేసే వారు. కాని కొన్ని ఏజెన్సీలు మాత్రం పట్టణానికి సమీపంలో వదిలివేయడంతో ఆ కుక్కలు తిరిగి పట్టణంలోకి రావడం వల్ల కుక్కలు పెరిగి పోయాయని పట్టణ ప్రజలు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి కుక్కల సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు.

700 కుక్కలకు ఏబిసి ఆపరేషన్‌కు ఏర్పాట్లు జరుగుతున్నాయి



పట్టణంలో 700 కుక్కలను మొదటి విడతగా గుర్తించాం. కుక్కల పెరుగుదల నివారణకు ప్రభు త్వం సత్తెనపల్లిలో బ్లూక్రాస్ సంస్థ ఆధ్వర్యంలో కుక్కలకు కుటం బ నియంత్రణ ఆపరేషన్ చేయి స్తాం. ప్రస్తుతం తొమ్మిది కుక్కలను సంస్థ నిర్వాహకులు తీసుకెళ్ళారు. ఆపరేషన్ అనంతరం వాటిని రెండువారాల పాటు అక్కడే ఉంచి రెబిస్ వ్యాక్సిన్ వేసి అనంతరం పిడుగురాళ్ళ పట్టణంలో ఏ ప్రాంతంలో పట్టుకున్నారో అక్కడనే కుక్కలను విడిచి పెడతారు. గతంలో కుక్కలను పట్టుకుని కేవలం రెబిస్ వ్యాక్సిన్ మాత్రమే వేసేవారు. ఇప్పుడు ఏబిసి ఆపరేషన్ నిర్వహించడం వల్ల కుక్కల పెరుగుదల సమస్య తగ్గిపోతుంది. **- పర్వతినేని శ్రీధర్ మున్సిపల్ కమిషనర్**

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన కొనసాగుతోంది

వైసిపి మాజీ మంత్రి విడుదల రజని

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రాష్ట్రంలో అరాచక పాలన పరాకాష్టకు చేరిందనీ, రెడ్‌బుక్ పాలన కొనసాగుతోందని వైసిపి మాజీ మంత్రి విడుదల రజని అన్నారు. ఆది వారం స్థానిక ఎన్ఆర్‌టి సెంటర్‌లోని తన నివాసంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నా కాల్ డేటాను పోలీసుల చేత ప్రస్తుత పల్నాడు జిల్లా ఎంపి లావు శ్రీకష్ణ దేవరాయలు తీయించారనీ, తనపై అనవ సరం గా అక్రమ కేసులు పెట్టారన్నారు. అప్పటి పోలీస్ అధికా రులు సస్పెండ్ కూడా అయ్యారన్నారు. తనపై ఏసీబీకి ఫిర్యాదు చేసిన వారిని ఎప్పుడు చూడలేదనీ, దీని వెనక సినిమా డైరెక్టర్‌గా కర్త, ఖర్మ, క్రియలావు శ్రీకష్ణదేవ రాయలు వ్యవహరిస్తున్నా రని అన్నారు. నాపై వస్తున్న ఫిర్యాదులన్నీ ఎంపీ లావు కార్యాలయం నుండి విడుదల అవుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో అరాచకపాలనకు పరాకాష్ట రెడ్‌బుక్ అన్నారు. ఎవరు ఎన్ని ఇబ్బందులు పెట్టినా భయపడేది లేదన్నారు. ఎన్ని కేసులు అయినా ఎదుర్కొంటాం.. పార్టీలో నిలబడతాం..మళ్ళీ జగన్‌ని సీఎం చేసుకుంటాం అన్నారు. లావు శ్రీకష్ణ దేవరాయలుని



అప్పటి మాజీ ముఖ్యమంత్రి జగన్‌కాల్ డేటా గురించి అడిగితే తల దించు కున్నారన్నారు. ఆయన గత ప్రభుత్వంలో వైజాగ్‌లో కారు చౌకగా కోట్లు రూపాయలు భూములు కొట్టేశా డన్నారు. మరో చెరువు భూమి కూడా కొట్టేసేందుకు పక్కాప్లాన్ తో వెళ్తున్నాడన్నారు. ఆయన ఎన్ని చేసినా ఎప్పుడు నేను ప్రశ్నించ లేదని గుర్తు చేశారు. ఇవాళ నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. చిలక లూరిపేటలో మరో నాయకుడు అవినీతికి కేరాఫ్ అడ్రస్ పత్తి పాటి పుల్లారావు నాపై అనేక మం దితో కేసులు పెట్టమని ప్రోత్స హిస్తూ దుర్మార్గానికి పాల్పడుతున్నా రన్నారు. మా లీగల్ వ్యవస్థ స్ట్రాంగ్‌గా ఉందని, ఎలాంటి కేసులైనా ఎదుర్కొంటా మన్నారు. సినీ నటుడు పోసానపై కేసులు పెట్టి ఏ విధంగా తిప్పారో మళ్లీ మేము అధికారంలోకి వచ్చాక ఇదే రాజ్యాంగాన్ని అమలు చేస్తాం.. ఎంపీ లావు, పత్తిపాటి పుల్లారావని వదిలేది లేదన్నారు. మా ప్రభు త్వం వచ్చాక లెక్కలు తేలుస్తామని హెచ్చరించారు.

ఉచిత వైద్య శిబిరాలు ఉపయోగించుకోండి : ప్రత్తిపాటి


ప్రజాశక్తి-చిలకలూరిపేట

కాటూరి వైద్య కళాశాల, ఎన్టీఆర్ వైద్య సేవ విభాగం సంయుక్తంగా అందిస్తున్న ఉచిత వైద్యసేవలను నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. ఆదివారం ఆయన చిలకలూరిపేట మండలంలోని బొప్పూడిలో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బొప్పూడితో పాటు చుట్టు పక్కల అయిదు గ్రామాల ప్రజల కోసం కాటూరి మెడికల్ కళాశాల, ఎన్టీఆర్ వైద్య సేవ విభాగం ఆధ్వర్యంలో గ్రామస్తులకోసం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి శిబిరంలో ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు, ఇంజక్షన్లు ఉచ్చితంగా అందించారు. ఎన్టీఆర్ వైద్యసేవ కింద అన్నిరకాల దీర్ఘకా



మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్

లిక వ్యాధులకు కూటమి ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్యచికిత్సలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మధన్ మోహన్, అంబటి సొంబాబు, గుంటూ కోటేశ్వరరావు, గ్రామ నాయకులు, కార్యకర్తలు కాటూరి మెడికల్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



భాస్కరబాబుని సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

భాస్కరబాబు ఉపాధ్యాయలోకానికి ఆదర్శం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఈ తరం ఉపాధ్యాయులు తాటి భాస్కరబాబుని ఆదర్శంగా తీసుకోవాలని మాచర్ల మండల విద్యాశాఖధికారి అల్లి సురేష్ గారు సూచించారు మాచర్ల లోని పిడబ్ల్యుడి కాలనీ ప్రాథమిక మాటసాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ ఈనెల 31వ తేదిన ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సురేష్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం ఉపాధ్యాయునిగా పనిచేసి ఎందరో విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దిన ఉత్తమ ఉపాధ్యాయుడని, ట్రైనింగ్ కార్యక్రమాలలో పాల్గొన్నారని బిగ్ హెల్ప్ సంస్థ ద్వారా పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేశారని కొనియాడారు. బిగ్ హెల్ప్ మేనేజంగ్ ట్రష్టి సరోజని మాట్లాడుతూ, ఉపాధ్యాయుడిగానే గాక సేవ సంస్థ ద్వారా ఆడపిల్లలకు అనేక స్కిల్ డెవలపుమెంట్ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం భాస్కరబాబుని సంఘం ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జె గంగాధరబాబు, ఉపాధ్యాయులు, బిగ్ హెల్ప్ సంస్థ సభ్యులు కుటుంబ సభ్యులు మిత్రులు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన వారిని కఠినంగా శిక్షించాలి

డాక్టర్ గోదా రమేష్ కుమార్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల గాంధీ కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి భారత రాజ్యాంగ నిర్మాతను ఘోరంగా అవమానిం చారనీ, తక్షణమే నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఘటన జరిగి రోజులు గడుస్తున్నా నిందితులను గుర్తించడంలో పోలీస్ అధికారులు విఫలమయ్యారన్నారు. నిందితులను గుర్తించి అరెస్టు చెయ్యకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు.

ప్రజా చైతన్య యాత్రలో వెలుగు చూసిన పలు సమస్యలు



పెన్షన్ రాలేదని నాయకులకు చెబుతున్న కోటయ్య

ప్రజాశక్తి మంగళగిరి

సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా చైతన్య యాత్రలు మూడో రోజుకు చేరాయి. రెండు బృందాలుగా ఏర్పడి ఆదివారం ఆంజనేయ కాలనీ, ఒకటి రెండు వార్డుల్లో ప్రచార యాత్రను చేపట్టారు. ఆంజనేయ కాలనీలో 24 రూపాయల మేరకు కరెంటు వాడారు. కానీ బిల్లు మాత్రం రూ.199లు వచ్చింది. విద్యుత్ బిల్లులు పరిశీలించగా 175 రూపాయలు ట్రూఆఫ్ చార్జీలు, అదనపు చార్జీల పేరుతో వసూలు చేస్తున్నారని గమనించారు. అదేవిధంగా గోలిక్ కోటయ్య 70 సంవత్సరాల వృద్ధుడు వేలిముద్రలు పడడం లేదని వైసీపీ ప్రభుత్వంలో గాని, కూటమి ప్రభుత్వంలో గాని పెన్షన్ రాలేదని కోటయ్య వాపోయారు. అతి పేదరికంలో నివసిస్తున్న కోటయ్య అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు మాట్లాడుతూ టిడిపి కూటమి నాయకులు ఎన్నికల ముందు బాదుడే బాదుడు అని వైసిపి ప్రభుత్వాన్ని విమర్శించారని అన్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ప్రజలకు హామీ ఇచ్చి గెలిచిన తర్వాత ప్రజలను మోసం చేశారని అన్నారు. పదినెలల్లో 16వేల కోట్ల రూపాయలు విద్యుత్తు బిల్లులు పెంచారని తెలిపారు. మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ అధికారంలోకి వచ్చాక వివిధ భూముల్లో ఇల్లు వేసుకుని నివాసముంటున్న 22 వేల మంది పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని విమర్శించారు. ఇటీవల నియోజకవర్గ పరిధిలో అయిదువేల మందికి ఇళ్ల పట్టా ఇస్తున్నట్లుగా మంత్రి లోకేష్ చెప్పారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం 22వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని రామారావు డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపు, ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాల కోసం, రేషన్ కార్డులు, అర్హులైన వారం దరికీ పెన్షన్లు ఇవ్వాలని కోరుతూ ఈనెల 25వతేదీ ఉదయం 10గంటలకు మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాలో ప్రజల పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు గత ప్రభుత్వం ఇచ్చిన రూ.24 వేలను ఇవ్వాలనీ, మంగళగిరి పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేయాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు పి బాలకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు వై.కమలాకర్, బాలాజీ, స్థానిక శాఖ కార్యదర్శి కే శ్రీనివాసరావు, స్థానిక నాయకులు కే వెంకటే శ్వరరావు, టి.హేమ సుందరరావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఎస్ కోటేశ్వరరావు, కే బుజ్జి బాబు, కే రాజుమోహన్ పాల్గొన్నారు.



విద్యుత్ బిల్లులపై మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ఒకటి రెండు వార్డుల్లో..

సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఒకటి, రెండు వార్డుల్లో సిపిఎం ప్రజా చైతన్య యాత్ర జరిగింది. ఈ సందర్భంగా యాత్ర బృందం సభ్యులకు ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను వివరించారు. ఒకటో వార్డు నుండి ఏడవ వార్డు వరకు కొండపోరంబోకు స్థలంలో ఇల్లు వేసుకొని నివాసముంటన్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్ లాల్ మాట్లాడుతూ కొండపైన వర్షం పడినప్పుడు ఇళ్లల్లోకి నీళ్ల రాకుండా డ్రైనేజీ నిర్మాణం చేపట్టి గౌతమ్ బుద్ధ రోడ్డు మెయిన్ డ్రైన్‌కు అనుసంధానం చేయాలని అన్నారు. అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరారు. ఈ యాత్రా బృందంలో సిపిఎం పట్టణ నాయకులు కే శ్రీనివాసరావు, స్థానిక నాయకులు కే.నాగేశ్వరరావు, కే. వెంకటేశ్వరరావు, ఎస్ కే బాబూలాల్, జగన్నాథం, షేక్ వలి, ఎం.వి. సుబ్బారావు, ఏ.వీరయ్య, కే.సాంబశివరావు, బి. కోటేశ్వరరావు, బి వెంకటరావు పాల్గొన్నారు.

బీసీల 'చలో ఢిల్లీ' వాయిదా

ప్రజాశక్తి మంగళగిరి

జాతీయస్థాయిలో ఈనెల 24, 25, 26 తేదీలలో జరుప తలపెట్టిన 'చలోఢిల్లీ' కార్యక్రమాన్ని అనివార్య కారణాలతో ఏప్రిల్ 1,2 తేదీలకు వాయిదా వేసినట్లు ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర రావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీన విజ్ఞాపన పత్రాలను అందజేస్తారని పేర్కొన్నారు. 2న బీసీల ప్రధాన డిమాండ్లపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 'భారీనిరసన ధర్నా' చేపట్టనున్నట్లు తెలిపారు.



బెంజమిన్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

విద్యావ్యాప్తికి బెంజమిన్ కృషి గొప్పది

ప్రజాశక్తి తెనాలి

అట్టడుగు వర్గాలలో విద్యావ్యాప్తికి విద్యాదాత, కరుణానిలయం విద్యా సంస్థల వ్యవస్థాపకులు పొన్నెకంటి బెంజమిన్ ఎనలేని కృషి చేశారని పలువురు వక్తలు కొనియాడారు. బెంజమిన్ 37వ వర్ధంతి సందర్భంగా ఆదివారం రూరల్ గ్రామంకొలకలూరులోని విద్యా సంస్థల ఆవరణలో ఆయన సమాధి వద్ద నివాళులు అర్పించారు. గ్రామంలో ఎలిమెంటరీ పాఠశాలలు, రెసి డెన్షియల్ ఉన్నత పాఠశాల, బాబుజగజ్జీవన్‌రామ్ రెసి డెన్షియల్ జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేసి ఎందరినో విద్యా వంతులుగా తీర్చిదిద్దారని కుటుంబ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో బెంజమిన్ కుమారుడు పి.దయాచారి, సమతా చారి, కుటుంబసభ్యులు పిబి విజయకుమారి, పి.సుధీర్ కుమార్, మాజీకరస్పాండెంట్ హేమలత, జార్జి థామస్, రెవ.డాక్టర్ కెస్టీవెన్‌పాల్, కరుణామయి పాల్గొన్నారు.

ప్రజాశక్తి తెనాలి

ఎందరో పేద విద్యార్థులకు విద్యనందించి వారి అభివృద్ధికి పాటుపడిన మహనీయులు పొన్నెకంటి బెంజిమెన్ అని వక్తలు పేర్కొన్నారు. రూరల్ గ్రామం కొలకలూరు బాబు జగజ్జీవన్‌రామ్ రీడింగ్ రూమ్‌లో బెంజిమెన్ వర్ధంతిని ఆది జాంభవ దళిత ఎంప్లాయిస్ సేవాసమితి(డెస్క్) ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సభకు డెస్క్ సెక్రటరీ ఉన్నం ఎహెస్కేల్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఐఓసీ డీలర్ యడ్లపల్లి రవి కిరణ్, డెస్క్ సభ్యులు కెపాపారావు, ఎస్ వినయ్‌కుమార్, ఎం గురుదేవ్, డాక్టర్ కెమోహనరావు, ఎం ప్రభాకరరావు, పి అనిల్ కుమార్, టి సాంబయ్య, పి సాంబశివరావు, కె జార్జి థామస్, ఎస్ మురళీధర్ పాల్గొన్నారు.

మంత్రి మనోహర్‌కు కౌలు రైతు సంఘం నాయకుల వినతి




మనోహర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న రైతు నాయకులు

ప్రజాశక్తి తెనాలి

వచ్చే ఖరీఫ్ సీజన్‌లోగా కొత్తకౌలు చట్టం తీసుకు రావాలని కోరుతూ రాష్ట్ర కౌలు రైతుల సంఘం ప్రతినిధి బృందం రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరింది. స్థానిక బోస్ రోడ్డులోని కార్యాలయంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు సారథ్యంలో శనివారం రాత్రి మంత్రిని కలిశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఖరీఫ్, రబీ సీజన్లో కొత్త కౌలు రైతు చట్టం రాకపోవడం వల్ల కౌలు రైతులు ఈ క్రాప్ నమోదు లోను, పంట రుణాలు పొందటం, ఇతర ప్రయోజనాలను రైతులు నష్టపోయినట్లు వివరించారు. వాస్తవ సాగు దారులుగా ఉండి నష్టాల్లో కూడా వ్యవసాయం చేస్తున్న కౌలు రైతుల పట్ల సానుకూలంగా స్పందించాలని కోరారు. ఎన్నికలకు ముందు తెలుగుదేశం కూటమి పాత కౌలు చట్టాన్ని రద్దు చేస్తామని, కౌలు రైతులకు మేలు జరిగేటట్లు కొత్త కౌలు చట్టం తీసుకొస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. మంత్రి మనోహర్ స్పందిస్తూ ప్రతిపాదనలన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చినట్లు బృందం వెల్లడించింది. కార్యక్రమంలో సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు ఎం.నాగమల్లేశ్వరరావు, జిల్లా నాయకులు ములకా శివసాంబిరెడ్డి పాల్గొన్నారు.

శిశిరం చిత్రం రెండో షెడ్యూల్ ప్రారంభం

ప్రజాశక్తి - తెనాలి రూరల్ : విద్య నేపథ్యంలో తెరకెక్కనున్న "శిశిరం" చిత్రం రెండవ షెడ్యూల్ టింగ్ తెనాలి చినరావూరులో ఆది వారం ప్రారంభమైంది. సినీ దర్శకులు కనపర్తి రత్నాకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో తెనాలి తహశీల్దార్ కె వి గోపాలకృష్ణ ముఖ్య పాత్ర పోషించారు. ఆయన మాట్లా డుతూ ఒక సన్నివేశంలో తాను నటించడం పల్ల ఆయన సంతోషంగా ఉందని చెప్పారు. సందేశాత్మక చిత్రాల ను ప్రభుత్వపరంగా ప్రోత్సహిస్తామన్నారు. దర్శకులు రత్నాకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల సంస్కృతి, సాంప్రదాయా లతో పాటు వాస్తవ మానవీయ కుటుంబ పరిస్థితులను ఆదివారం తెనాలి, శేకూరు గ్రామాల్లో చిత్రీకరించినట్లు తెలియజేశారు.



క్లాప్ కొడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

చిత్రంలోని పాటలు సోషల్ మాధ్యమాల్లో వైరల్ కావడంపై సంతోషం వ్యక్తం చేశారు. తెనాలి పట్టణానికి చెందిన యువ సంగీత దర్శకుడు శాండి అద్దంకి సంగీతం సమకూర్చారని చెప్పారు. శ్రీకష్ణ ఆర్ట్స్ బ్యానర్ పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి కో ప్రొడ్యూసర్లుగా వెంకటప్రసాద్ అమిరినేని, సాధు చలపతి, కన్నెగంటి రవి, అనిల్ మూకిరి వ్యవహరిస్తున్నారన్నారు.

పంజాబ్ రైతులపై దాడికి నిరసనగా సంఘీభావం



నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి, పెదనందిపాడు:

రైతుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఢిల్లీ సరిహద్దుల్లో చేస్తున్న రైతుల శాంతియుత నిరసనపై పోలీసుల దమనకాండను నిరసిస్తూ సంఘీభావంగా ఆదివారం పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్లో రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరిస్తామని, పంటలకు కనీస మద్దతు ధరల చట్టం తీసుకు వస్తామని పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీని ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. సిఐటియు నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ దేశానికి అన్నం పెడుతున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించటం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, పోపూరి సుధీర్, నల్లమోతు రాజేంద్ర, మర్రిలక్ష్మి, షేక్‌షమీ, గొల్లపూడి సుబ్బారావు, గద్దె మల్లేశ్వర రావు, రమేష్, నూర్‌బాషా, సుభాన్ సాహెబ్ పాల్గొన్నారు.

షాహిది దివస్-అమర వీరుల సంస్మరణ దినోత్సవం

ప్రజాశక్తి -మేడికొండూరు

మండలంలోని విశదల అడ్డ రోడ్డు వద్ద గల ఎన్ఆర్ఐ ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం షాహిదీ దివాస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపల్ కోట శ్రీనివాస మాట్లాడుతూ భరతజాతికి స్వేచ్ఛా జీవితాన్ని ప్రసాదించడానికి 23 యేళ్ళ వయసులోనే వీరోచిత పోరాటాలు చేసి, యువ హృదయాలపై చెరగని ముద్ర వేసిన స్వాతంత్ర్య సమర వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఉరికంబం ఎక్కి ప్రాణత్యాగం చేశారని అన్నారు. వీరికి జోహార్లు అర్పించారు. వివిధ శాఖల అధిపతులు వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీహరి, రెహమాన్,నాగేశ్వరావు, రాము, నాగేశ్వరావు, సౌజన్య, కేఎస్ఆర్, పేస్ సొసైటీ సెక్రటరీ పి రమేష్ బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం నిర్వహణ పట్ల కళాశాల సెక్రటరీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె శరత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి తిలక్ బాబు హర్షం వ్యక్తం చేశారు.



దుస్తులు పంపిణీలో కమిషనర్ శేషన్న అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి

పేదలకు వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి తెనాలి

రంజాన్ మాసం సందర్భంగా పట్టణానికి చెందిన డాక్టర్ జాఫర్ సాదిక్ భాష ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జకాత్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ బి శేషన్న, విశిష్ట అతిథిగా అసిస్టెంట్ కమిషనర్ వి లక్ష్మీపతి పాల్గొని ట్రస్ట్ తరపున ఏర్పాటుచేసిన వస్త్రాలను పేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీ వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ ఇస్మాయిల్ బేగ్, కాకతీయ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ డిఎల్ కాంతారావు, నాయకులు టి.హరిప్రసాద్, కె.వాసుదేవ నాయుడు, షేక్ నఫీజ్, షేక్ ఖలీల్, షేక్‌రఫీ, వసీం పాల్గొన్నారు.

శివాలయం హుండీలు లెక్కింపు

ప్రజాశక్తి - పెదకాకాని

మండల కేంద్రమైన పెదకాకానిలోని మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం నుండి దేవదాయ శాఖ అధికారి పర్యవేక్షణలో దేవస్థానము నందలి కానుక హుండీలు తెరిచి ఆలయ కళ్యాణ మండపంలో లెక్కించుట జరుగునని దేవస్థాన ఉప కమీషనర్, కార్యహణాధికారి గోగినేని లీలాకుమార్ ఆదివారం తెలిపారు. ఈనెల 29వ తేదీన అమావాస్య కావడంతో గ్రహదోషాలు, ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో బాధపడే వారు రాహు కేతు పూజలు చేయించికొని తమ దోషాల నుంచి నివారణ పొందవచ్చునని ఆయన తెలిపారు.



పరీక్ష రాస్తున్న మహిళలు

500 మంది అక్షరాస్యులకు పరీక్షలు

ప్రజాశక్తి చేబ్రోలు

ఆదివారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 50 పరీక్ష కేంద్రాలలో 500 మంది నూతన అక్షరాస్యులు పరీక్షలు రాసినట్లు వెలుగు ఏపిఎం శ్రీలక్ష్మి తెలిపారు. నిరక్షరాశులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తెచ్చిన ఉల్లాస్ ప్రోగ్రాం ద్వారా జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో వెలుగు సిబ్బంది మూడు నెలలుగా స్వచ్ఛంద వాలంటీర్ల సహకారంతో రాత్రిబడులు నిర్వహించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దారు. పరీక్ష కేంద్రాలను ఎంపీడీవో కె లలిత , వయోజన విద్యాశాఖ సూపర్వైజరు డి వెంకట స్వామి, వెలుగు ఏపిఎం శ్రీలక్ష్మి సందర్శించి పరీక్ష నిర్వహణను పరిశీలించారు.

కార్మిక రాజ్యాంతోనే అసమానతల అంతం

ప్రజాశక్తి-గుంటూరు



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సిఎస్‌ఆర్ ప్రసాద్, నేతాజి, నళినీకాంత్ తదితరులు

కార్మికవర్గ రాజ్యం స్థాపన ద్వారానే సమాజంలో అసమానతలు తొలగిపోతాయని విప్లవ రచయితల సంఘం నాయకులు సిఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. ఆదివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని పార్టీ కార్యాలయంలో లెనిన్ రచించిన 'రాజ్యం-విప్లవం' పుస్తకంపై విశ్లేషణ కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం నాయకులు జి.వెంకట రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ భవిష్యత్తులో కార్మికవర్గ రాజ్యం అనివార్యంగా ఏర్పడుతుందని అన్నారు. కార్మికవర్గ నియంతత్వం ద్వారా పాత పెట్టుబడిదారీ ప్రభుత్వాలను తిరిగి అధికారంలోకి రానివ్వకుండా చేయడం జరుగుతుందని లెనిన్ తెలియజేశారని అన్నారు. శ్రమకి, మేథో శ్రమకి, పురుష శ్రమకి మహిళల శ్రమకు, పట్టణ , గ్రామీణ శ్రమకు మధ్య అంతరాలు తొలగినప్పుడు కమ్యూనిస్టు సమాజం ఏర్పడుతుందని అన్నారు. కమ్యూనిస్టు సమాజంలో ప్రతి ఒక్కరూ పని చేయటం, పనికి తగ్గ ఫలితం పొందడం జరుగుతుందని అన్నారు. లెనిన్ రచించిన 'రాజ్యం-విప్లవం' సమాజ మార్పునకు దోహదపడుతుందని, దీనిని అందరూ కచ్చితంగా చదవాలని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. ఈ పెట్టుబడిదారీ సమాజంలో అంతరాలు మరింతగా పెరుగుతున్నాయని తెలియజేశారు. సమాజ మార్పు కోసం కృషి చేసే లౌకిక ప్రజాస్వామ్య వాదులందరూ బిజెపి అనుసరిస్తున్న పెట్టుబడిదారీ, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. తొలుత భగత్ సింగ్ చిత్రపటానికి సిపిఎం సీనియర్ సభ్యులు ఎ.వీరవర్మ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు, కమిటీ సభ్యులు యం.ఏ.చిష్టి, నగర కార్యదర్శి కె. నళినీకాంత్, నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.ముత్యాలరావు, కె.శ్రీనివాసరావు, బి.సత్యనారాయణ, జి.రమణ, షకీలా, ఎ.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ యూనివర్సిటీ అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఈసీఈ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ శేఖర్ మానేపల్లికి తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వర్సిటీ వీసీ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. 'డిజైన్ ఆఫ్ వైడ్ బ్యాండ్, అల్ట్రా వైడ్ బ్యాండ్, సూపర్ వైడ్ బ్యాండ్ యాంటినాస్ ఫర్ మైక్రోవేవ్ ఇమేజింగ్' అనే అంశంపై శేఖర్ పరిశోధన చేశారని తెలియజేశారు. ఈయనకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఈసీఈ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నేలటూరి సుమన్ గైడ్‌గా వ్యవహరించారన్నారు. ఈ సందర్భంగా శేఖర్‌ను వీసీ, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు అభినందించారు.



ప్రొఫెసర్ శేఖర్‌ను అభినందిస్తున్న వీసీ, డీన్‌లు, అధిపతులు

గుండె జబ్బుల పట్ల నిర్లక్ష్యం తగదు

డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే

ప్రజాశక్తి-గుంటూరు



వైద్యశిబిరం వాలంటీర్లతో డాక్టర్ గోఖలే, ఇతర అతిధులు

గుండె వ్యాధుల పట్ల నిర్లక్ష్యం తగదని, నిష్ణాతులైన డాక్టర్ల సూచ నలు తప్పక పాటించాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆళ్ళ గోపాలకష్ణ గోఖలే అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీ హాస్పిటల్ సౌజన్యంతో గుంటూరులోని జెకెసి కళాశాల ఆవరణలో దాదాపు 700 మంది గుండె జబ్బుల రోగులకు ప్రముఖ కార్డియోథొ రాసిక్ అండ్ వాస్క్యులర్ సర్జన్, హార్ట్ అండ్ లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ పద్మశ్రీ డాక్టర్ ఆళ్ళ గోపాలకృష్ణ గోఖలే నేతత్వంలో వైద్య శిబిరం ఘనంగా జరిగింది. వివిధ జిల్లాల నుండి దీర్ఘకాలంగా గుండె సంబంధిత జబ్బులతో బాధపడుతూ హాజరైన వందలాది మందికి బిపి, షుగరు, ఈసీజీ, ఎకో పరీక్షలు నిర్వహించి, వైద్యుల సూచనల మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ గోఖలే మాట్లాడుతూ గతంలో గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్న వాళ్లు కనీసం ఏడాదికి ఒకసారి గుండె వైద్యులను సంప్రదించి పరీక్ష చేయించుకోవాలని కోరారు. మారుతున్న జీవన శైలిలో సమతుల్య ఆహారంతో పాటు చక్కటి వ్యాయామం అవసరం ఎంతైనా ఉందన్నారు. శ్రీ హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ బి.వి. నారాయణరెడ్డితో పాటు డాక్టర్ వై. రామకిషోర్, డాక్టర్ ఆనం నందకిషోర్, వైద్య సిబ్బంది పాల్గొని రోగులను పరీక్షించి సలహాలు, సూచనలు అందజేశారు. తొలుత జెకెసి కళాశాల సెక్రెటరీ జాగర్లమూడి మురళీ మోహన్, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మానవత చైర్మన్ పావులూరి రమేష్, అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీనివాసరావు, మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి. ధనుంజయ రెడ్డి, కార్యదర్శి కె.సతీష్, కోశాధికారి టీ.వీ సాయిరాం, జెకెసి కళాశాల ప్రిన్సిపల్ గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కంటి సమస్యల నివారణ

మెడెక్స్ హాస్పిటల్స్ అడ్వాన్స్డ్ ఐకేర్ యూనిట్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రజాశక్తి-గుంటూరు

అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతోపాటు కంటి సమస్యలను ముందుగానే గుర్తించటం ద్వారా భవిష్యత్‌లో ఎదురయ్యే సమస్యల నుండి బయటపడవచ్చుని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.ఆదివారం చంద్రమౌళీనగర్‌లోని భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో నెలకొల్పబడిన మెడెక్స్ హాస్పిటల్స్‌లో అధునాతన కంటి సంక్షరణ వైద్యసేవలను ఆయన ముఖ్య అతిధిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ విద్యారంగంలో పేరెన్నికగన్న భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మెడెక్స్ హాస్పిటల్స్ ద్వారా వైద్య రంగంలో అడుగుపెట్టి గుంటూరు, పరిసర ప్రాంత ప్రజల కోసం అధునాతన కంటి, చర్మ, దంత సైకాలజీ వైద్యసేవలు ప్రారంభించటం అభినందనీయం అన్నారు. చిన్నారుల్లో కంటి సమస్యలను తొలి దశలోనే గుర్తించి, తగిన చికిత్స అందించటానికి మెడెక్స్ హాస్పిటల్స్‌లో అధునా తన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉందన్నారు. ప్రముఖ గుండె మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు, పద్మశ్రీ డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే మెడెక్స్ హాస్పిటల్స్‌లో లభ్యం అవుతున్న కంటి, దంత, చర్మ, సైకాలజీ వైద్యసేవల విభాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా నగరంలోని ప్రముఖ రాజకీయ, విద్య, వైద్య ప్రముఖులు హాస్పిటల్‌ను సందర్శించి రామకృష్ణకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అడ్వాన్స్డ్ ఐకేర్ యూనిట్ ప్రారంభోత్సవం సందర్భంగా మార్చి 23 నుండి ఏప్రిల్ 23 వరకూ ఉచిత కంటి వైద్య పరీక్షలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్‌చైర్మన్ భాష్యం హనుమంతరావు, మెడెక్స్ హాస్పిటల్స్ అడ్వాన్స్డ్ ఐకేర్ యూనిట్ చీఫ్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ యర్రారపు మాధవీలత, సిబ్బంది పాల్గొన్నారు.



ఐకేర్ యూనిట్ ప్రారంభిస్తున్న మంత్రి పెమ్మసాని తదితరులు

శస్త్రచికిత్సల్లో పేదలకు అమర్చే పరికరాలు నూరుశాతం నాణ్యమైనవి

పేదలకు మరింత చేరువగా డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవా పథకం : ప్రజాశక్తితో పల్నాడు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.చంద్రశేఖర్



డాక్టర్ జి చంద్రశేఖర్



వైద్య సేవల కోసం ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్‌కు వెళ్లే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడం లక్ష్యంగా డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని జిల్లాలో మరింత పారదర్శకంగా అమలు చేస్తున్నా మని పథకం పల్నాడు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జి చంద్రశేఖర్ అన్నారు. జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవ పథకం అదనపు సిఇఓ జిల్లా కలెక్టర్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ సాధన దిశగా ప్రభుత్వ లక్ష్యం మేరకు పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని ఆయుష్మాన్ భారత్ పిఎం జన్ ఆరోగ్య యోజన పథకాన్ని సంయుక్త నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నా యన్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పథకం సంబంధించి మరిన్ని వివరాలను డాక్టర్ చంద్రశేఖర్ వివరించారు.

పల్నాడు జిల్లాలో పథకం కింద ఎన్ని నెట్ వర్క్ హాస్పిటల్స్ ఉన్నాయి?

పల్నాడు జిల్లాలో 117 హాస్పిటల్ లో పథకం సమర్ధవంతంగా అమలు అవుతుంది. వీటిలో 61 ప్రయివేటు హాస్పిటల్ లు కాగా 8 డెంటల్, ఏపివివిపి హాస్పిటల్లు 10, పి.హెచ్.సి లు 38 ఉన్నాయి.

డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద ఏయే రాష్ట్రాలలో వైద్య సేవలు పొందొచ్చు? ఏ వ్యాధులకు పథకం వర్తిస్తుంది?

డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ఏపితో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో వైద్య సేవలు పొందే అవకాశం ఉంది. నరాలకు సంబంధించిన వ్యాధులు, కంటి ఆపరేషన్‌లు, అన్ని రకాల ట్రామా వైద్య సేవలు, క్యాన్సర్ ఇలా మొత్తం 3256 వ్యాధులకు పథకం కింద వైద్య సేవలు పొందే అవకాశం ఉంది.

జిల్లాలో పథకం అమలు తీరు ఎలా ఉంది?

జ) పల్నాడు జిల్లాలో 61 ప్రయివేటు నెట్ వర్క్ హాస్పిటల్ లలో 67 మంది వైద్య మిత్రాలు ఉన్నారు. ప్రతి 10 మంది మిత్రలకు 1 టీం లీడర్ ఉండి ప్రతి రోజు మిత్రలకు సలహాలు సూచనలు రోగుల పట్ల వ్యవహరించాల్సిన తీరు ఆ రోజు వారి పరిధిలోని రోగులకు అందిన వైద్య సేవలు వివరాలు తెలుసుకుంటారు.

పథకం వర్తించిన్నప్పటికీ రోగుల వద్ద హాస్పిటల్ యాజ మాన్యం నగదు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి?

అక్కడక్కడ కొన్ని ఆరోపణలు వినిపిస్తు న్నాయి. ఈ క్రమంలో వైద్య మిత్రలు స్వయంగా రోగుల వద్దకు వెళ్లి అందుతున్న వైద్య సేవలు గురించి ఆరా తీసి వైద్యులు డబ్బులు ఏమైనా తీసుకున్నారా అనే వివరాలను కూడా సేకరిస్తు న్నారు. ఏవరైనా డబ్బులు ఇచ్చామని చెబితే రోగి వీడియో తీసుకుని ఉన్నతాధికారులను పంపించి చర్యలు తీసుకుంటాం.

ఇటీవల కాలంలో ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? ఆయా హాస్పిటల్‌లపై ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

కొన్ని హాస్పిటల్స్ లను సందర్శించినప్పుడు 9 మంది రోగులు దగ్గర డబ్బులు వసూలు చేసినట్లు నిరూపణ అయింది. జిల్లా కలెక్టర్ సమక్షంలో 7 ఫిర్యాదులలో పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధితుని దగ్గర వసూలు చేసిన నగదుకు 5 నుండి 10 రెట్లు అదనంగా జరిమానా విధించడం జరిగింది .జరిమానాల నగదు రూ 25 లక్షలు జిల్లా కో ఆర్డినేటర్ హోదాలో నేను జిల్లా కలెక్టర్ జాయింట్ బ్యాంక్ ఖాతాలో ఉన్నాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పేద ప్రజల ఆరోగ్య శ్రీ కార్డు లేని వారికి వైద్య సేవలకు ఖర్చు చేయడం జరుగుతుంది.

రాత్రి సమయంలో వైద్యమిత్రలు ఉండరు.. అత్యవసర సేవలు, ప్రమాద బాధితుల పరిస్థితి ఏంటి?

ఉదయం 9 గంటల సాయంత్రం 5 గంటల వరకు వైద్యమిత్ర విధులలో ఉంటారు. రాత్రి సమయంలో అత్యవసర ప్రసవాలు, క్షతగాత్రులకు పథకం ద్వారా చికిత్స అందించేందుకు నరసరావుపేటతో పాటు ప్రధాన పట్టణాలలో పట్టణ స్థాయిలో ప్రత్యేక వైద్య మిత్ర ఉంటారు. రోగులు హాస్పిటల్ కు రాగానే హాస్పిటల్ యాజమాన్యం ద్వారా సమాచారం అందుకున్న ఆరోగ్య మిత్ర హాస్పిటల్‌కి వచ్చి రోగి వివరాలు నమోదు చేసుకొని ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద నమోదు చేరతారు. ప్రతి నెట్ వర్క్ హాస్పిటల్ లో ఆరోగ్య మిత్ర ఫోన్ నెం ఉంటుంది.ఏ సమయంలో అయినా ఫోన్ చేయొచ్చు.

పథకం ద్వారా వచ్చే కంటి అద్దాలు, విరిగిన ఎముకలకు రాడ్లు నాణ్యమైనవి కాదని వైద్యులే చెబుతున్నారు? దీనికి మీ సమాధానం?

అటువంటి మాటలు నమ్మొద్దు. పథకం ద్వారా వచ్చే పరికరాలు అన్ని విధాలా నాణ్యమై నవే. ప్రజలలో ఇటువంటి అపోహలు వీడేం దుకు ఆరోగ్య మిత్రలు రోగులకు అవ గాహన కల్పిస్తున్నారు. రోగులను తప్పు దోవ పట్టిం చేందుకు వైద్యులు కూడా అలా చెప్పడం సరి కాదు. పథకంలో వైద్య సేవలు పొందే వారిలో 90 శాతం మందికి పైగా పేద ప్రజలు ఉంటారు. వైద్యులు అంకితభావంతో సేవలు అందించాలి.

జిల్లాలో 108, 104 సేవలు ఎలా ఉన్నాయి? ఎన్ని వాహనాలు ఉన్నాయి?

పల్నాడు జిల్లాలో 108 వాహనాలు 31, 104 వాహనాలు 40 వరకు ఉన్నాయి. ఆయా వాహన సేవలు బాగానే అందుతున్నాయి. ఎటువంటి ఫిర్యాదులు రాలేదు. మందులు, కిట్లు, వాహనాల పని తీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

చికిత్స అందిస్తున్న వైద్యులకు, పథకం ద్వారా సేవలో పొందుతున్న రోగులకు మీరిచ్చే సూచనలు ?

వైద్యులు అంకిత భావంతో రోగులకు సేవలు అందించాలి. పల్నాడు జిల్లాలో వైద్యులు విశేషంగానే సేవలు అందిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం క్షతగాత్రులను తక్షణమే చికిత్స అందించాలి. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద సేవల పొందేందుకు ఆయా నెట్‌వర్క్ హాస్పిటల్ కి వెళ్లిన రోగులు మొదట ఆరోగ్య మిత్రను కలిసి ఆరోగ్య పరిస్థితి వివరించి సలహాలు తప్పనిసరిగా తీసుకోవాలి.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా